విశాఖ సీఐఐ సమ్మిట్ చరిత్రాత్మకం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): విశాఖ సీఐఐ సమ్మిట్ చరిత్రాత్మకంగా నిలుస్తుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, డీసీఎంఎస్ చైర్మన్ వై. నాగేశ్వరరావు యాదవ్‌తో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. తిక్కారెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ వ్యూహాత్మకంగా వ్యవహరించి 613 ఒప్పందాల ద్వారా రూ.13,25,716 కోట్ల పెట్టుబడులు, 16,13,188 ఉద్యోగాలు రావడం రాష్ట్ర అభివృద్ధిపై పెట్టుబడిదారుల నమ్మకానికి ప్రత్యక్ష సాక్ష్యమని అన్నారు. రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర మూడు ప్రాంతాలకు సమానంగా పెట్టుబడులు వచ్చేలా కంపెనీలను గైడ్ చేశారని తెలిపారు. రెండు రోజుల్లోనే భారీ ఎత్తున ఒప్పందాలు కుదుర్చుకొని పెట్టుబడుల వర్షం కురిపించడం చంద్రబాబు విజన్ అని కొనియాడారు. ఉమ్మడి కర్నూలు జిల్లా డ్రోన్ హబ్‌గా, ఉమ్మడి అనంతపురం, కడప జిల్లాలు రెన్యూవబుల్, తిరుపతి జిల్లా మాన్యుఫ్యాక్చరింగ్, చిత్తూరు జిల్లా టెక్స్‌టైల్ హబ్‌గా నిలుస్తున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ రాష్ట్రంలో రూ. 3,65,304 కోట్ల పెట్టుబడులతో 1,26,471 ఉద్యోగావకాశాలు సృష్టించే 35 సంస్థలతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోవడం సంతోషకరమైన విషయమన్నారు. సమావేశంలో డైరెక్టర్లు సంజీవలక్ష్మి, నంద్యాల నాగేంద్ర, పోతురాజు రవికుమార్, ఆదోని నాయకుడు ఉమాపతి నాయుడు, కేవీ సుబ్బారెడ్డి, పుల్లయ్య చౌదరి పాల్గొన్నారు.

సమస్యలను త్వరగా పరిష్కరించాలి: కలెక్టర్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సిరి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా, నాణ్యతతో అర్జీదారులు సంతృప్తి చెందేలా త్వరగా పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎ.సిరి అధికారులను ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో పాల్గొని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారానికి ప్రత్యేక దృష్టితో పని చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఆయా శాఖల పరిధిలోని పీజీఆర్ఎస్ గ్రీవెన్స్‌పై ఆడిట్ నిర్వహించాలన్నారు. సంబంధిత కార్యాలయ హెడ్‌లు అర్జీదారులతో మాట్లాడాలని, ఎండార్స్‌మెంట్ స్పష్టంగా రాసి అర్జీదారునికి వాట్సాప్ చేయాలని సూచించారు. అనంతరం ముఖ్యమంతి కార్యాలయం నుంచి వచ్చిన అర్జీలలో రీ ఓపెన్ అయిన అర్జీదారులతో కలెక్టర్ నేరుగా ఫోన్‌లో మాటాడారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ వెంకటనారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ అనూరాధ, కొండయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హంద్రీ నీవా అభివృద్ధికి చేయూత

● మొదటి విడత రూ. 1170 కోట్లు

● నాబార్డు ఏజీఎం మోహన్‌రెడ్డి



హంద్రీనీవా కాలువను పరిశీలిస్తున్న నాబార్డు బృందం

పత్తికొండ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ అభివృద్ధికి రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కింద నాబార్డు సహకారం అందిస్తుందని ఏజీఎం సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం బృంద సభ్యులు కవ్య, కేశవరావు కలిసి ఆయన హంద్రీనీవా కాలువను పరిశీలించారు. హెచ్ఎన్ఎస్ ఎస్ఈ పాండురంగయ్య, డీఈ చంద్రశేఖర్‌రెడ్డి వారి వెంట ఉన్నారు. ఈ సందర్భంగా ఏజీఎం పందికోన వద్ద విలేకర్లతో మాట్లాడుతూ గతేడాది హంద్రీనీవా కాలువ విస్తరణ, సైడ్ వాల్ నిర్మాణాల కోసం రూ.1170 కోట్ల రుణాన్ని మంజూరు చేశామన్నారు. మొదట విడత పనుల ఆధారంగా రెండో విడతగా రూ.950 కోట్ల రుణం కోసం నివేదికలు అందాయన్నారు. అందుకు సంబంధించి 85 కి.మీ నుంచి 216 వరకు నాలుగు రోజులపాటు హంద్రీనీవా కాలువ పరిశీలన చేస్తామన్నారు. నాబార్డు బృంద సభ్యులతో పాటు పందికోన రిజర్వాయరును 61 వేల ఎకరాల సాగునీరు అందంచే లక్ష్యంగా నిర్మించినట్లు హెచ్ఎన్ఎస్ ఎస్ఈ పాండురంగయ్య నాబార్డు అధికారులకు తెలిపారు. అయితే బండ్ నిర్మాణం, కుడి ఎడమ కాలువల నిర్మాణం పెండిగ్‌లో ఉండడంతో ఇప్పటి వరకు 19వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు ఇంకా 42 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉందన్నారు. ఈ పెండింగ్ పనులకు రూ.250 కోట్లు అవసరమవుతాయని రాష్ట ప్రభుత్వానికి నివేకదికలు పంపించామని అన్నారు.

సాగుకు అన్నదాత సుఖీభవ



కర్నూలు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రబీ సాగుకు సన్నద్ధం అవుతున్న రైతులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. బుధవారం అన్నదాత సుఖీభవ - పీఎస్ కిసాన్ పథకం' రెండో విడత నగదు విడుదల చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు పూర్తి చేసింది. కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం పెండ్లిమర్రిలో సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు చొప్పున ఒక్కో రైతు ఖాతాలో రూ.7 వేలు చొప్పున జమ చేయనున్నారు. ఈకేవైసీ చేసుకున్న రైతుల వివరాలు ప్రకారం జిల్లాలో 2.65 మంది రైతుల ఖాతాల్లో రూ.185.50 కోట్లు జమ చేయనున్నారు. అయితే.. మంగళవారం రైతుల తుది జాబితా వస్తుందని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. ఆగస్టు 2న ఓ పండుగ వాతావరణంలో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశారు. బుధవారం కూడా అదే తరహాలో పంపిణీ చేసేందుకు కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అధ్వర్యంలో వ్యవసాయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాలో ప్రధాన జీవనాధారం వ్యవసాయం. ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 4,19,221 హెక్టార్లు కాగా, రబీ సాధారణ సాగు విస్తీర్ణం 1.20 లక్షల హెక్టార్లు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పత్తి, మిరప, ఉల్లి రైతులు అధిక వర్షాలకు తీవ్రంగా నష్టపోయారు. తాజాగా రబీ సాగుపై ఆశలు పెంచుకున్నారు. కష్టాల నుంచి కొంతైనా గట్టెక్కవచ్చని రబీ సీజన్ సాగుకు రైతులు సిద్ధం అవుతున్నారు. ఈ సమయంలో ప్రభుత్వం నుంచి కొండంత ఆర్థిక భరోసా లభించనుంది.

ఇచ్చిన మాటకు కట్టుబడి

పంట సాగు చేయడానికి రైతులకు అప్పులు పుట్టక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్రం ఇచ్చే సాయంతో కలపి రూ.20 వేలు పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ పథకం ద్వారా అందజేస్తామని గత ఎన్నికల సమయంలో అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. కూటమి మేనిఫెస్టోలో కూడా సుపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన అన్నదాత సుఖీభవ కింద అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. జిల్లాలో నియోజకవర్గాల వారిగా స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పంపిణీ చేసేలా జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

● రేపు రైతుల ఖాతాల్లోకి రూ. 7 వేలు

● రైతుకు అండగా అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకం నిధులు

● రెండో విడత రూ.185 కోట్లు

● 2.65 లక్షల మందికి ఆర్థిక భరోసా



రైతుల ఖాతాల్లో జమ చేయనున్న అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ నిధులు. సుమారుగా రూ.కోట్లల్లో..

నియోజకవర్గం	రైతులు	రాష్ట్రం	కేంద్రం	మొత్తం
ఆలూరు	59,000	29.50	11.80	41.30
కోడుమూరు	35,000	17.50	7.00	24.50
పాణ్యం	30,000	15.00	6.00	20.00
పత్తికొండ	51,000	25.50	10.20	35.70
మంత్రాలయం	41,000	20.50	8.20	28.70
ఆదోని	18,000	9.00	3.60	12.60
ఎమ్మిగనూరు	31,000	15.50	6.20	21.70
మొత్తం	2,65,000	132.50	53.00	185.50

అర్హులందరికీ ఇళ్లు

● టిడ్కో గృహాల పూర్తికి రూ.18 కోట్లు

● 10 వేల ఇళ్ల పనులు మార్చి 31 నాటికి పూర్తి చేస్తాం

● టిడ్కో ఇళ్ల పంపిణీలో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

కర్నూలు కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ ఇల్లు ఉండాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇళ్లు ఇస్తామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. సోమవారం జగన్నాథగట్టు వద్ద ఉన్న ఎన్టీఆర్ కాలనీలో నిర్మాణాలు పూర్తయిన టిడ్కో గృహాలను మంత్రి టీజీ భరత్, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్‌లు పంపిణీ చేశారు. ముందుగా నూతన గృహాలను ప్రారంభించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 2,61,040 టిడ్కో గృహాలు ఉండగా, వాటిలో 1.50 లక్షలు పూర్తి అయ్యాయని తెలిపారు. ఇందులో కర్నూలులోనే 10 వేల ఇళ్లు ఉండటం, మిలిగిన వాటి పూర్తి కోసం రూ.18 కోట్లు మంజూరు కావడం విశేషమన్నారు. 976 ఇళ్లలో తొలుత 187 ఇళ్లను ఇస్తున్నామని, మొత్తం 40 వేల మంది ఇక్కడ నివాసాలు ఏర్పడితే ఈ ప్రాంతం పట్టణంలా మారుతుందన్నారు. సమీపంలోనే పరిశ్రమలు రావడంతో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు.

ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ మార్చి 31 లోగా 976 ఇళ్లను అందించగలమన్నారు. ఓర్వకల్లు మండలంలో పరిశ్రమలు రావడంతో 13 వేల మందికి ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ పేదలకు పక్కా ఇళ్లు ఇవ్వాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని, గత 17 నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా 92 వేల ఇళ్లు పూర్తయ్యాయని తెలిపారు. టిడ్కోలో అన్ని వసతులతో పేదలకు అనువైన గృహాల నిర్మాణం జరుగుతున్నాయని చెప్పారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న టిడ్కో గృహాలను ఈ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ, బొందిలి కార్పొరేషన్ల చైర్మన్లు పార్వతమ్మ, విక్రమ్‌సింగ్, బ్రాహ్మణ, వాల్మీకి, ఏపీ ఫైనాన్స్ కార్పొరేషన్ల డైరెక్టర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, తోళ్ల మంజునాథ్, బోయ రామాంజనేయులు, టిడ్కో ఎస్ఈ నాగమోహన్, ఎంఈలు సూర్యనారాయణ, గుప్త, అధికారులు పెంచలయ్య, మధు, కార్పొరేటర్లు పరమేష్, కైప పద్మలత తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు గృహాలను పంపిణీ చేస్తున్న మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యేలు గౌరు చరిత, బొగ్గుల దస్తగిరి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



గ్రీన్ కో రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు దేశానికే ఆదర్శం

● గ్రీన్ పవర్ నిల్వలో పీఎస్పీలదే కీలక పాత్ర

● దేశ వ్యాప్తంగా 224 జీడబ్ల్యూ పీఎస్పీ సామర్థ్యం గుర్తింపు

● కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ కట్టర్



మొక్కకు నీరు పోస్తున్న కేంద్ర మంత్రి మనోహర్ లాల్

ఓర్వకల్లు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలోని గ్రీన్ కో రెన్యువబుల్ ఎనర్జీ పవర్ ప్రాజెక్టు భవిష్యత్తులో దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని కేంద్ర విద్యుత్, గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని గుమ్మితం తండా సమీపంలో ఉన్న గ్రీన్ కో పవర్ ప్రాజెక్టు పరిసర ప్రాంతాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పవర్ ప్రాజెక్టు ప్రాంగణంలో పార్లమెంటు సభ్యుల సంప్రదింపుల కమిటీ సమావేశాన్ని విద్యుత్ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసింది. పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులపై దృష్టి సారించిన ఈ సమావేశానికి కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అధ్యక్షత వహించారు. విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద యెస్సో నాయక్, లోక్ సభ, రాజ్య సభ నుంచి విద్యుత్, మంత్రిత్వ శాఖ సంప్రదింపుల కమిటీ సభ్యులు, కేంద్ర విద్యుత్ అథారిటీ సీఈఏ, సీపీఎస్‌యూల నుంచి సీనియర్ అధికారులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సభ్యులను ఉద్దేశించి కేంద్ర మంత్రి మాట్లాడుతూ సౌర శక్తి లేని సమయాల్లో మిగులు గ్రీన్ పవర్‌ను నిల్వ చేయడం, విద్యుత్ డిమాండ్‌ను తీర్చడం ద్వారా పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు(పీఎస్పీ)లు కీలక పాత్ర పోషిస్తాయన్నారు.

మిగతా 6వ పేజీలో..

సీఐ సతీశ్ హత్యపై సీబీఐ విచారణ జరపాలి

7

కర్నూలులో కుమ్మరి కులస్థుల భారీ ర్యాలీ, ధర్నా

జంతు ప్రపంచానికి రారాజు



పులి ఆవాసానికి కీలకమైన ఆత్మకూరు అటవీ డివిజన్

● పర్యావరణ పిరిమిడ్‌లో అగ్రభాగన పెద్దపులి

● ప్రపంచంలోనే ప్రసిద్ధికెక్కిన వన్యప్రాణిగా గుర్తింపు

● దేశానికే తలమానికంగా నిలిచిన నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ ప్రాజెక్ట్

● నేడు పెద్దపులిని భారత ప్రభుత్వం జాతీయ జంతువుగా స్వీకరించిన రోజు

ఆత్మకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో అత్యంత కీలకమైన పెద్దపులిని జాతీయ జంతువుగా 1972 నవంబరు 18న భారత ప్రభుత్వం ప్రకటించింది. ఆ సమయంలోనే టైగర్ రిజర్వు ఫారెస్టులను 1973 ఏప్రిల్ 1వ తేదీన దేశ వ్యాప్తంగా ఎంపిక చేశారు. 1972 పెద్దపులుల గణాంకాల ప్రకారం దేశంలో 1827 పులులు మాత్రమే ఉండేవి. కానీ.. 2022 పులుల గణాంకాల ప్రకారం మన దేశంలోని 18 రాష్ట్రాల్లో గల 58 టైగర్ రిజర్వు ఫారెస్టుల పరిధిలో 3167 ఉన్నట్లు అంచనా వేశారు. ప్రపంచంలోనే పులుల సంఖ్యలో దాదాపు 70శాతం పులులు మనదేశంలో ఉందని గర్వంగా చెప్పవచ్చు.

పెద్దపులి రాజసానికి ప్రతీక. పర్యావరణ సూచికలో త్రికోణ(పిరమిడ్) అగ్రభాగాన నిలిచిన సైబీరియన్ జాతికి చెందిన పెద్దపులి ప్రపంచంలోని పలు దేశాలకు జాతీయ చిహ్నంగా వెలుగొందుతోంది. అలాగే మరికొన్ని దేశాలు ఏకంగా తమ జాతీయ పతాకాలపైనే పెద్దపులి చిత్రాన్ని రూపొందించుకున్నాయి. రెడ్‌డేటా బుక్‌లో చోటు సంపాదించుకుని షెడ్యూల్-1 కోవకు చెందిన పెద్దపులి యావత్ భూప్రపంచంలో అంతరించి పోతున్న జంతువుగా గుర్తింపు దక్కించుకుంది. ఫాన్థెరటైగ్రీస్ కుటుంబానికి చెందిన పెద్దపులిని ఎన్నోదేశాలు జాతీయ జంతువుగా ఎంచుకున్నాయి.



దేశానికే తలమానికం నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ ప్రాజెక్ట్



దేశంలో పులుల వృద్ధిరేటు తగ్గేందుకు కారణాలు..

వన్య జీవనంలోని పులి ఆయుర్దాయం పదేళ్లు ఉండగా, జంతు ప్రదర్శనశాలల్లో 20ఏళ్ల వరకు ఉంటుంది. అయితే దేశంలో పులుల వృద్ధిరేటు తగ్గేందుకు అనేక కారణాలు కనిపిస్తున్నాయి. ప్రత్యేకించి అడవులు క్షీణించి పంటపొలాలు పెరగడం, రోడ్లు, జలాశయాలు, గనులు, జలఉత్పత్తి కేంద్రాలు, వ్యవసాయంతో పాటు పులి ఆహారమైన హెర్బివోట్స్(గడ్డితినే జంతువుల)ను వేటాడటం వల్ల పులి ఉనికికే ముప్పు వాటిల్లుతోంది. పులి జీవన విధానం ప్రకారం దాని నిర్విఘ్న జీవనానికి, ప్రత్యుత్పత్తికి, ఆటంకం లేని ఆవాసాలు ఎంతో అవసరం. మానవ కార్యకలాపాలు లేని నిషిద్ధ ప్రాంతాలు పులి జీవనానికి కీలకం. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని 1972లో ఇలాంటి కారణాలను గుర్తించే పెద్దపులుల అభయారణ్యాలను ఎంపిక చేశారు. అదేక్రమంలో పెద్దపులిని జాతీయ జంతువుగా ఎంపిక చేసి వాటి సంరక్షణకే కేంద్ర అటవీ, పర్యావరణ శాఖలు పులుల సంరక్షణకు శ్రీకారం చుట్టాయి.

మిగతా 6వ పేజీలో

గ్రీన్ కో రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు దేశానికే ఆదర్శం

(5వ పేజీ తరువాయి)

పీఎస్పీ జలాశయాల నుంచి బాష్పీభవన నష్టాల సమస్యలపై ఆచరణీయ పరిష్కారంగా తేలియాడే సౌర విద్యుత్ ప్రాజెక్టులను అమలు చేయాలని మంత్రి సూచించారు. సకాలంలో స్థల కేటాయింపు, నీటి కేటాయింపు వేగవంతమైన అనుమతుల ద్వారా పీఎస్పీ అభివృద్ధిని సులభతరం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వాల కీలక పాత్రను ఆయన నొక్కి చెప్పారు. పీఎస్పీల అభివృద్ధిని వేగవంతం చేయడానికి గ్రీన్ ఎనర్జీ సెస్, నీటి పన్ను, రిజర్వాయరు లీజు, ఫీజులు వంటి చార్జీలను ఉపసంహరించుకోవడం గురించి రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించాలని ఆయన కమిటీ సభ్యులను కోరారు. దేశవ్యాప్తంగా దాదాపు 224 జీడబ్ల్యూ పీఎస్పీ సామర్థ్యాన్ని గుర్తించినట్లు కమిటీ సభ్యులకు సమాచారం అందిందని తెలిపారు. వీటిలో దాదాపు 7 జీడబ్ల్యూ మొత్తం సామర్థ్యం కలిగిన పది పీఎస్పీలు ప్రారంభించినట్లు తెలిపారు. విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద యెస్సో నాయక్ కమిటీ సభ్యులతో మాట్లాడుతూ 2025-26లో 1680 మెగావాట్ల పిన్నాపురం పీఎస్పీలోని ఎనిమిది యూనిట్లను 500 మెగావాట్ల టెహ్రీ పీఎస్పీతో పాటు విజయవంతంగా ప్రారంభించడం గొప్ప విజయమని ఆయన కొనియాడారు. కేంద్ర మంత్రి వెంట గ్రీన్ కో గ్రూప్ సీఈవో, ఎండీ చలమశెట్టి అనిల్, గ్రీన్ కో ప్రాజెక్టు డెరెక్టర్ శ్రీనివాసులు, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసనాయుడు ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

రాష్ట్రానికి పరిశ్రమలు క్యూ

న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్



మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పరిశ్రమలు క్యూ కడుతున్నాయని న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్యతో కలిసి మాట్లాడారు. ఏపీ పెట్టుబడుల దిశను మార్చే విధంగా సీఐఐ భాగస్వామ్య సదస్సు జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఎంతో రాష్ట్రాభివృద్ధికి ఎంతగానో శ్రమిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర మూడు ప్రాంతాలకు సమానంగా పెట్టుబడులు వచ్చేలా పలు కంపెనీలతో మార్గదర్శనం చేశారన్నారు. ప్రతి రంగానికి స్పష్టమైన పాలసీలు రూపకల్పన చేసి సింగిల్ విండో సిస్టం ద్వారా పెట్టుబడులకు అనుమతులు వేగంగా ఇవ్వడం పరిశ్రమల ఆకర్షణకు ప్రధాన కారణమన్నారు. చంద్రబాబు విజన్ వల్ల 613 ఒప్పందాల ద్వారా రూ13,25,716 లక్షల పెట్టుబడులు, 16,13,188 ఉద్యోగాలు రావడం రాష్ట్రాభివృద్ధి పట్ల పెట్టుబడిదారుల నమ్మకానికి ప్రత్యక్ష సాక్ష్యం అని కొనియాడారు. సమ్మిట్ కంటే ఒకరోజు ముందే పెట్టుబడిదారుల వరద మొదలైందన్నారు. ఇందులో రూ3,65,304 కోట్ల పెట్టుబడులతో 1,26,471 ఉద్యోగాలు సృష్టించే 35 సంస్థలతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోవడం చాలా గొప్ప విషయమన్నారు. ఏపీ సీఆర్డీఏ, ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమలు, వాణిజ్యం, ఐటీ, ఎలక్ట్రానిక్స్ టూరిజం, మున్సిపల్ వంటి కీలక శాఖలలో పెట్టుబడుల కోసం ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తెలిపారు. గతంలో జగన్ విధంసకర విదానాలకు బయపడి పారిపోయిన రెన్యూ, హీరోఫ్యూచర్స్, ఏబీసీ వంటి కంపెనీలు బాబు పాలనకు ఆకర్షితులై తిరిగి రాష్ట్రానికి రావడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల శ్రీరాములు, ఉప్పరి, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్లు సురేష్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా రామదాసు రథోత్సవం



భక్తజన సందోహం నడుమ స్వామివారి రథోత్సవం

కోడుమూరు రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్దగిరిలో రామదాసుస్వామి రథోత్సవం సోమవారం సాయంత్రం కనులపండువగా జరిగింది. తిరునాళ్లను పురస్కరించుకుని రథంపై స్వామివారు ఊరేగారు. వేడుకను పురస్కరించుకుని ఆలయంలో అభిషేకం, పుష్పార్చన, ఆకుపూజ, హోమం, హారతులు నిర్వహించారు. సాయంత్రం రామదాసుస్వామి ఉత్సవ విగ్రహాన్ని సుందరంగా ముస్తాబు చేసిన రథంపై కొలువుదీర్చారు. అనంతరం కొబ్బరి, గుమ్మడికాయలను కొట్టి సాత్విక బలిదానం చేశారు. దీంతో భక్తులు జయజయధ్వానాలు చేస్తూ రథాన్ని స్మారక మందిరం దగ్గరకు, తిరిగి ఆలయం వద్దకు లాగారు. పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు. వేడుకల్లో 'కుడా' మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోట్ల చక్రపాణిరెడ్డి, టీడీపీ నాయకులు కోట్ల రాఘవేంద్రారెడ్డి, కోట్ల కౌశిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు మురళీకృష్ణ ఆలయంలో పూజలు చేశారు.

కుష్ఠు వ్యాధి గుర్తింపు సర్వే ప్రారంభం

కర్నూలు హాస్పిటల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధిని నిర్మూలించేందుకు 17 నుంచి 30వ తేదీ వరకు వ్యాధిగ్రస్థులను గుర్తించే సర్వే నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో ఎల్.భాస్కర్ తెలిపారు. సోమవారం నగరంలోని అరోరానగర్‌లో లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ సర్వేను డీఎంహెచ్‌వో ప్రారంభించారు. కుష్ఠువ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స చేయించుకోవాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వలంటీర్లు ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారని, ఇందుకు ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యూక్లియర్ మెడికల్ ఆఫీసర్ మల్లికార్జునరెడ్డి, డాక్టర్ లీనారెడ్డి, సునీలమ్మ, డీపీఎంవో సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్ రెడ్డి, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

ఆకతాయిల ఆటకట్టు



ఆకతాయిల ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. మహిళలు, యువతులు, విద్యార్థినులు నిత్యం ఎక్కడో ఒక చోట వేధింపులకు గురవుతూనే ఉన్నారు. ఎవరితోనూ చెప్పుకోలేక లోలోపల కుమిలిపోతున్న వారెందరో. దీంతో వీరు ఇంటినుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. వీటన్నిటికీ చెక్ పెట్టడానికి ప్రభుత్వం 'శక్తి' యాప్‌ను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు బృందాలను ఏర్పాటు చేసింది. స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాల్సిన అవసరం లేదు. శక్తి యాప్‌లో ఫిర్యాదు చేస్తే చాలు.. శక్తి టీం సభ్యులు స్పందించి చర్యలు తీసుకుంటారు.

- ప్రత్యేక బృందాలతో నిరంతరం నిఘా
- 'శక్తి' యాప్‌పై అవగాహన కార్యక్రమాలు
- హాట్‌స్పాట్ ప్రదేశాలను గుర్తించి నిఘా

నంద్యాల టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆకతాయిల ఆగడాలకు కళ్లెం వేసేలా ఏర్పటైన శక్తి టీమ్స్ మహిళా భద్రతకు భరోసానిస్తాయి. ప్రేమపేరుతో యువకుల నుంచి విద్యార్థినులు, యువతులు పడుతున్న ఇబ్బందులను అరికట్టేలా నంద్యాల ఎస్పీ సునీల్ షెరాన్ ఆధ్వర్యంలో జిల్లాలో 40 మంది సిబ్బందితో ఒక్కో టీమ్‌లో ఐదుగురు చొప్పున ఎనిమిది బృందాలను ఏర్పడ్డారు. వీరికి ఇద్దరు సీఐలు వీరికి నేతృత్వం వహిస్తున్నారు. జిల్లాలో 1,694 అవగాహన సదస్సులు 154 ఆత్మరక్షణ శిబిరాలు ఏర్పాటు చేశారు.

ప్రధాన కూడళ్లలో నిఘా



శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్నా సీఐ జయరాములు

జిల్లాలో నంద్యాలతో పాటు ముఖ్యమైన నియోజకవర్గాల్లో ముఖ్య కూడళ్లలో కళాశాలలు, పాఠశాలలు, రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్ల వద్ద నిరంతరం నిఘా పెడుతున్నారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ హయాంలో షీటీమ్స్ సమర్థవంతంగా పని చేశాయి. పట్టణ ప్రాంతాల్లో మఫ్టీలో ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ నిఘా కొనసాగిస్తూ ఈవ్‌టీజింగ్‌ను కట్టడి చేశాయి. కూటమి ప్రభుత్వం శక్తి యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది.

బృందాల పనితీరుపై నిఘా

శక్తి టీం పనితీరును డీజీపీ కార్యాలయం నుంచి నిరంతరం పర్యవేక్షిస్తుంటారు. ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించిన నివేదికలను బృంద సభ్యులు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు పంపుతున్నారు. ప్రేమ పేరుతో, ఈవ్ టీజింగ్ చేయడం వల్ల విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతూ ఎవరికీ చెప్పుకోలేక ఇబ్బందులు పడుతుంటారు. ఇంట్లో వాళ్లకు చెబితే చదువు మాన్పించి వేస్తారన్న భయంతో విద్యార్థినులు తమలో తామే కుమిలిపోతున్నారు. ఇలాంటి వారంతా శక్తి యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే ఆకాతాయిలను ఆట కట్టించాడనికి శక్తి టీమ్‌లు సిద్ధంగా ఉన్నాయి.

మహిళలకు రక్షణగా 'శక్తి' యాప్

నంద్యాల జిల్లాలో ఇప్పటివరకు సుమారుగా 46 వేల మంది శక్తి యాప్‌ను వారి సోల్‌ఫోన్‌ల్లో డౌన్‌లోడు చేయించి వారికి ఎలా ఫిర్యాదు చేయాలి? అని అవగాహన కల్పించారు. అంతేకాకుండా జిల్లాలో కొన్నింటిని హాట్ స్పాట్ ప్రాంతాలుగా గుర్తించి వాటిపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేస్తున్నారు. పట్టణంలో ఎస్బీవోస్ కాలనీ, ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్, ఆత్మకూరు బస్టాండు, ఆళ్లగడ్డలోని పలు ప్రాధాన ప్రాంతాలు, నందికొట్కూరు వంటి బనగానపల్లె వంటి ప్రాంతాల్లో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసి ఈయా ప్రాంతాల్లో నిరంతరం సిబ్బంది తిరుగుతూ రక్షణ కల్పిస్తున్నారు. అలాగే ఆత్మరక్షణలో ఏదైనా సమస్యలు వచ్చినప్పుడు వారికి వారే స్వయంగా కాపాడుకునే విదంగా ప్రత్యేకంగా శిబిరాలు నిర్వహించి విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నారు.



ఆత్మ రక్షణ విద్యను నేర్పిస్తున్న సిబ్బంది

జిల్లాలో జరిగిన ఘటనలు

నంద్యాల ఎస్బీవోస్ కాలనీలో అక్కడ బ్యాంకు కోచింగ్ చదువుతున్న ఒక అమ్మాయిని ప్రేమ పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని శక్తి టీం వారికి ఫిర్యాదు అందింది. వెంటనే అక్కడికి చేరుకున్న సిబ్బంది ఆకతాయిని పట్టుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. ఇలాంటివి పునరావృత్తం కాకుండా ఉండాలని సూచించారు. నంద్యాల బస్టాండులో బస్సు ఎక్కడానికి వచ్చిన విద్యార్థినులను కొంత మంది ఆకతాయిలు ఇబ్బందులకు గురి చేస్తుండడంతో శక్తి యాప్ ద్వారా ఫిర్యాదు అందుకుని సమస్యను పరిష్కరించారు. నంద్యాల ఓల్డ్ టౌన్‌లో భర్త తాగి వచ్చి భార్యను కొడుతున్నాడని, ఇబ్బందులకు గురి చేస్తున్నాడని సమాచారం మేరకు అక్కడికి చేరుకుని ఆమెకు రక్షణ కల్పించారు.

ధైర్యంగా ఫిర్యాదు చేయండి

మహిళలు, యువతులుచ విద్యార్థినులు ఆకతాయిల బారి నుంచి కాపాడటమే శక్తి టీం విధి. 40 మంది సిబ్బందితో నిరంతరం నిఘా ఏర్పాటు చేశాం. పాఠశాల్లో , కళాశాల్లో శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్నాం. ఎవరైనా ఫిర్యాదు యాప్ ద్వారా చేయవచ్చు. 112 నంబరుకు ఫోన్ చేసిన ఫిర్యాదులు స్వీకరిస్తాం. బాధితులు ధైర్యంగా ఫిర్యాదు చేయొచ్చు.

- జయరాములు సీఐ, మహిళా స్టేషన్, నంద్యాల

శివనామస్మరణతో హోరెత్తిన యాగంటి

ఘనంగా కార్తీక చివరి సోమవారం



యాగంటిలో క్యూలైన్‌లో భక్తులు

బనగానపల్లె, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీక చివరి సోమవారం సందర్భంగా యాగంటి క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. శివనామ స్మరణతో యాగంటి క్షేత్రం హోరెత్తింది. ఉమామహేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజామున ఉమామహేశ్వరస్వామి వార్లకు అభిషేకం, మహారుద్రాభిషేకం తదితర ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభం వద్ద మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అర్చనలు, అభిషేకాలు రద్దు చేశారు. కిందిభాగంలో పుష్కరిణి పక్కనుంచి ప్రత్యేక క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ప్రధాన పుష్కరిణిలో భక్తులు స్నానమాచరించి యాగంటి బసవేశ్వరస్వామిని, ఉమామహేశ్వరస్వామిని దర్శించుకున్నారు. క్షేత్రపాలకుడు వీరభద్రస్వామి వార్లకు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. క్యూలైన్‌లో ఎండ తగులకుండా భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ మౌళీశ్వరరెడ్డి, ఆలయ సిబ్బంది భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. మనోజ్ అనే భక్తుడు భక్తులకు నీటివసతిని కల్పించారు. క్యూలైన్లను సీఐ ప్రవీణ్ కుమార్, మంజునాథరెడ్డి, బనగానపల్లె ఎస్ఐ దుగ్గిరెడ్డి, అవుకు ఎస్ఐ రాజారెడ్డి బందోబస్తు పర్యవేక్షించారు ఉమామహేశ్వర నిత్యాన్నదాన సత్రంలో పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో దొనపాటి యాగంటిరెడ్డి, దస్తగిరిరెడ్డి, రామారెడ్డిలు భక్తులకు అన్నదానం చేశారు. ఉమామహేశ్వర రెడ్ల అన్నదానసంస్థ, ఆర్యవైశ్య నిత్యాన్నదాన సంస్థ, వీర శైవ లింగాయత్ బసవేశ్వర అన్నదాన సంస్థలతో పాటు గాయతరి బ్రాహ్మణ సంఘం, గోశాల వద్ద బుగ్రావెంకటేశ్వర్లు, మారునీళ్ల చెలిమ వద్ద రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఉచిత భోజన వసతి భక్తులకు కల్పించారు.



ధ్వజస్తంభం వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వైభవంగా నేలబిలం తిరునాళ్లు

- పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తజనం
- పూజలో పాల్గొన్న పలువురు టీడీపీ నాయకులు



స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

కొలిమిగుండ్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కొలిమిగుండ్ల మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నేలబిలం మల్లేశ్వరస్వామి తిరునాళ్ల సోమవారం వైభవోపేతంగా సాగింది. ఈ సందర్భంగా స్వామి వారి కళ్యాణం, రథోత్సవాలకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఆలయ ప్రాంగణంలోని పవిత్రమైన నేల బిలం (గుహ)లో స్నానం చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల రామేశ్వర రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు మూలె రామేశ్వరరెడ్డి, నియోజకవర్గ కో కన్వీనర్ వీఆర్ లక్ష్మీరెడ్డి తదితరులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఎస్ఐ గోపాల్, 20మంది పోలీసులు ప్రత్యేక బందోబస్తు చేపట్టారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలంలోని పసుపుల గ్రామ సమీపంలోని గుండం మల్లికార్జున స్వామి ఆలయం వద్ద కార్తీక చివరి సోమవారం సందర్భంగా నిర్వహించిన బండలాగుడు పోటీలను బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి సోమవారం ప్రారంభించారు. ముందుగా గుండం మల్లికార్జునస్వామికి బీసీ రాజారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం చైర్మన్ సిద్దేశ్వరప్ప ఆధ్వర్యంలో ఉత్సవాలు వైభవంగా సాగాయి. శివచంద్రస్వామి ఆధ్వర్యంలో మంత్రాలయానికి చెందిన పండిత్ గౌతమి స్వామి బృందం ఆధ్వర్యంలో ఉదయం గణపతి హోమం, రుద్ర, లక్ష్మీనరసింహ, నవగ్రహ, మృత్యుంజయ, ధన్వంతి, సుదర్శన హోమాలను నిర్వహించారు. అనంతరం రైతు సంబరాల్లో భాగంగా బండలాగుడు పోటీను బీసీ రాజారెడ్డి ప్రారంభిం చారు. పోటీల్లో పాల్గొనేందుకు 20 ఎడ్ల జతలు హోరాహోరీగా సాగాయి. ఎడ్ల యజమానులను బీసీ రాజారెడ్డి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలను వైభవంగా నిర్వహించడం అబినందనీయమన్నారు. ఇదిలా ఉండగా కార్తీక మాసం సందర్భంగా వేలాది మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సిద్దేశ్వరప్ప, టీడీపీ నాయకులు భూషన్న, షేక్షావలి, బాలనాయుడు, మధుసూధన్ నాయుడు, ఓబులేసు, తిరుపతినాయక్, జయనాయక్, అశోక్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ దృష్టికి 84 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, నవంబరు 17 (ఆంధ్ర జ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి సమస్యలు త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. సోమవారం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 84 మంది ప్రజలు తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తెచ్చారు. వీటిలో ప్రధానంగా.. తెలిసిన వ్యక్తులతో కలిసి ఆన్‌లైన్‌లో జేఎం ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థ పేరుతో రూ.1.40 కోట్లు మోసం చేశారని అశోక్‌నగర్‌కు చెందిన యశ్వంత్ ఫిర్యాదు చేశాడు. భాను ప్రసాద్ అనే వ్యక్తి వైజాగ్‌లోని ఎల్‌టీడబ్ల్యూ కంపెనీలో వర్క్ ఫ్రమ్ హోం ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి రూ.1.50 లక్షలు చొప్పున 15 మందిని మోసం చేశాడని ఆదోనికి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగాలను పర్మినెంట్ చేస్తామని చెప్పి మోసం చేశారని శరీన్‌నగర్ చెందిన జగన్నాథం ఫిర్యాదు చేయగా, ఆరుగురు కొడుకులు అన్నం కూడా పెట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని సి.బెళగల్ మండలం కొండాపురానికి చెందిన తిమ్మప్ప ఆవేదన వ్యక్తం చేశాడు. కార్యక్రమంలో ఏఎస్పీ హుసేన్ పీరా, సీఐలు రామకృష్ణ, ఇబ్రహీం ఉన్నారు.

జంతు ప్రపంచానికి రారాజు



(5వ పేజీ తరువాయి)

ఇతర వన్యప్రాణుల కంటే వైవిధ్యమైన మానసిక లక్షణాలు కలిగివున్న పెద్దపులికి ప్రపంచవ్యాప్తంగా విశేషమైన గుర్తింపు ఉంది. ఇంతటి విశిష్టత కలిగిన పెద్దపులి అవయవాలకు బహిరంగ మార్కెట్‌లో మంచి గిరాకీ వుందని చెప్పవచ్చు. విదేశీ మార్కెట్‌లో పులి చర్మం కనీస ధర రూ.50 లక్షల పైబడి పలుకుతున్నట్లు తెలుస్తోంది. పెద్దపులి ఒక కాలిగోరు విలువ రూ. 50వేల నుంచి రూ.లక్ష వరకు పలుకుతోంది. ఇలాంటి వ్యాపార దృష్టి ప్రకృతిలో అరుదైన, పర్యావరణంలో కీలకమైన పెద్ద పులుల మనుగడకు సవాల్‌గా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో కూడా దేశంలో, నల్లమలలో పులుల సంఖ్య పెరుగుతోంది.

దేశానికే తలమానికం నల్లమల :

నల్లమలలో విస్తరించిన నాగార్జునసాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం పులుల సంరక్షణలో దేశానికే తలమానికంగా నిలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల, ప్రకాశం, పల్నాడు జిల్లాల పరిధిలో 3727.82చ.కి.మీల పరిధిలో విస్తరించి దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వు ఫారెస్ట్‌గా గుర్తింపు దక్కించుకుంది. ఇందులో 2444చ.కి.మీల కోర్ ఏరియా ఉండగా, 1283.82కిమీల బఫర్ ఏరియా గుర్తించారు. కాగా ఎన్ఎస్‌టీఆర్‌లో 2014-15లో 37 పెద్దపులులు ఉండగా ప్రస్తుత గణాంకాల ప్రకారం 2023-24లో ఎన్ఎస్‌టీఆర్‌లో 87 పెద్దపులులు ఉన్నట్లు అంచనా. మొత్తంగా పులికూనలతో కలిపి వందకుపైగానే ఉన్నట్లు తెలుస్తోంది. 2023 మార్చి నెలలో ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని ముసలిమడుగు సెక్షన్‌లోని పెద్దగుమ్మడాపురం గ్రామ సమీపంలో ఓపెద్దపులి నాలుగు ఆడపులి కూనలకు జన్మనిచ్చింది. అయితే తల్లిపులి నుంచి పులికూనలు దూరమైనప్పటికీ ఒకే ఈతలో ఏకంగా నాలుగు పులికూనలకు జన్మనివ్వడం దేశవ్యాప్తంగా సంచనంగా మారింది. నల్లమలలో పులుల సంఖ్య రెట్టింపు అవుతున్న క్రమంలో కారిడార్‌ను పెంచే అవకాశం వుందని అటవీ అధికారులు చెబుతున్నారు.

పర్యావరణ పరిరక్షణలో పెద్దపులి మనుగడే కీలకం



పర్యావరణ పరిరక్షణలో పెద్దపులి మనుగడ కీలకం. పులి ఆవాసాన్ని ఏర్పాటు చేసుకున్న చోట వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి. పర్యావరణం సమతుల్యంగా వుంటుంది. పులుల రక్షణకై అటవీశాఖ ఎంతో కృషి చేస్తోంది. ప్రత్యేకించి పులుల ప్రత్యుత్పత్తి కోసం అడవుల్లో అనుకూల వాతావరణ పరిస్థితుల్ని ఏర్పాటు చేస్తున్నాం.

- విఘ్నేష్ అప్పావు, డిప్యూటీ డైరెక్టర్, ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్

బుక్కాపురంలో కార్తీక వన భోజనాలు

హాజరైన తానా అధ్యక్షుడు నిరంజన్



కార్యక్రమంలో పాల్గొన్న తానా అధ్యక్షుడు నిరంజన్

మహానంది, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీక చివరి సోమవారం సందర్భంగా మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో కమ్మ సంఘం ఆధ్వర్యంలో వనభోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో తానా అధ్యక్షుడు నిరంజన్ పాల్గొన్నారు. కమ్మసంఘం సేవలను కొని యాడారు. అంతకముందు ఆయన మహానంది ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కమ్మ సంఘం నాయకులు గడ్డం నాగ పుల్లయ్య, హరిప్రసాద్, వేమూరి కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన గడిగే శ్రీనివాసులు (57) ఎల్లెల్సీ కాలువలో అనుమానాస్పదంగా మృతి చెందాడు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలివి.. శ్రీనివాసులు అతడి బంధువు ఆదెమ్మ మృతి చెందగా అంత్యక్రియల నిమిత్తం ఎమ్మిగనూరు పట్టణానికి వచ్చారు. అంత్యక్రియల అనంతరం గడిగే శ్రీనివాసులు, రాఘవేంద్ర, రాఘవేంద్ర ప్రసాద్ కలిసి ఎల్లెల్సీ కాలువకు స్నానానికి వెళ్లారు. స్నానం చేస్తుండగా నీటి ప్రవాహానికి శ్రీనివాసులు కొట్టుకుపోయినట్లు వెంట వెళ్లిన వారు చెప్పారు. అయితే తమకు అనుమానం ఉందని శ్రీనివాసులు భార్య లక్ష్మి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



శ్రీనివాసులు (ఫైల్)

మరో ఇద్దరు..

డోన్ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజా కాంప్లెక్స్ వెనుకవీధిలో కొత్తపేటకు చెందిన అశ్విని, పాతపేటకు చెందిన రౌడీషీటర్ ఫరీద్ ఇద్దరూ ఒకే ఇంట్లో సోమవారం అనుమానస్పద స్థితిలో మృతి చెందారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. పోలీసులు వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ ఇద్దరు కలసి ఆత్మహత్య చేసుకున్నారా? లేక ఎవరైనా హత్య చేశారా? వీరిద్దరూ అక్కడ ఎందుకున్నట్లు? అన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఒకే ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగినట్లు కొందరుచెబుతున్నారు. ఈ విషయంపై స్థానిక పోలీసులు, కర్నూలు క్లూజ్ టీమ్ వచ్చి పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.



ఫరీద్ (ఫైల్)

తల్లి మందలించిందని...

- పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

ఆదోని, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కల్లుబావి వీధికి చెందిన దేవేంద్ర, జ్యోతి దంపతుల కుమారుడు లక్ష్మీనరసింహస్వామి (25) పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణంలోని కల్లుబావి కాలనీకి చెందిన లక్ష్మీ నరసింహస్వామి మద్యంకు అలవాటు పడడంతో ఇంట్లో ఉన్న తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్థాపానికి గురైన లక్ష్మీనరసింహస్వామి మద్యంలో విషపూరిత మందు కలుపుకుని ఆదివారం తాగాడు. స్థానికులు హుటాహుటిన ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు తీసుకెళ్లగా. చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.



లక్ష్మీనరసింహస్వామి (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆదోని, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆస్పరి రోడ్డు సోమవారం రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. సీఐ అబ్దుల్‌గౌస్ తెలిపిన వివరాల మేరు... ఆదోని పట్టణం లోని ఎంజీజీ కాలనీలో నివాసముంటున్న మాధవస్వామి(52) నారాయణ కాలేజీలో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నట్లు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం సమయంలో భోజనానికి ఇంటికి చేరుకుని భోజనం అనంతరం తిరిగి కాలేజీకి వెళ్తుండగా హాస్పిటల్ రోడ్డులోని జీవీ మాల్ సమీ పంలో మాధవస్వామి వెళ్తున్న సైకిల్‌ను అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చిన లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో మాధవస్వామి అక్కడికక్కడే మృతిచెందాడు. ఇంటికి పెద్దదిక్కును కోల్పోవడంతో భార్య సుంకన్న, కుమారుడు శ్రీనాథ్ విలపిస్తున్న తీరును చూపరులను కంటతడి పెట్టించింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ అబ్దుల్‌గౌస్ తెలిపారు.



మాధవస్వామి (ఫైల్)

ఎల్లెల్సీలో మృతదేహం

కోడుమూరు రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వర్కూరు గ్రామ పరిధిలో ఎల్లెల్సీ కెనాల్‌లో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ప్రవాహంలో కొట్టుకవచ్చిన మృతదేహం 3ఎల్ కాలువ సమీపంలో కంపచెట్ల మధ్యలో నిలిచిపోయింది. అటుగా వెలుతున్న రైతులు విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ట్రైనీ ఎస్‌ఐ మణికంఠ సిబ్బందితో చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మృతుడి వయసు దాదాపు 40 ఏళ్లు ఉండవచ్చన్నారు. ఒంటిపై డ్రాయర్ మినహా దుస్తులు లేవన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు కోడుమూరు పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

నలుగురు నిందితుల అరెస్టు

- దొర్నిపాడులో ఉద్యోగాల పేరుతో మోసం కేసు
- రెండు జిల్లాలలో 1200 మంది బాధితులు



నిందితులతో డీఎస్పీ ప్రమోద్, సీఐ, పోలీసులు

ఆళ్లగడ్డ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొర్నిపాడులో ఉద్యోగాల పేరుతో రూ. కోట్లు వసూలు చేసి ఉడాయించిన నలుగురు నిందితులను దొర్నిపాడు మండలం కొండాపురం గ్రామాల మధ్య ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాం సమీపంలో అరెస్టు చేశారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సోమవారం నిందితులను డీఎస్పీ ప్రమోద్ అరెస్టు చూపించారు. అనంతపురం జిల్లా యెల్లనూర మండలం గొడ్డుమర్రి గ్రామానికి చెందిన అంతపు రాజారెడ్డికి దొర్నిపాడు గ్రామానికి చెందిన బాచిరెడ్డి వీరా రెడ్డి కుమార్తెతో వివాహమైంది. రుద్రవరం మండలం కొండమాయపల్లె గ్రామానికి చెందిన సింగతల ఉమామహేశ్వరరెడ్డి, దొర్నిపాడు గ్రామానికి చెందిన బాచిరెడ్డి వీరారెడ్డి, బాచిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి లతో కలిసి ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి మోసం చేశారు. రెండు జిల్లాల్లో 1200 బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది. 2023లో హెల్త్ అండ్ వెల్త్ పైనాన్సియల్ సొల్యూషన్ పేరుతో కంపెనీ స్థాపించి హైదరాబాద్‌లోని కూకట్ పల్లి హెడిఎఫ్‌సీ బ్యాంక్‌లో కంపెనీ, వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలను ప్రారంభించారు. ఒక్కొక్కరి నుండి రూ 2.5 లక్షలు, రూ 3 లక్షలు, రూ 3.5 లక్షలు మొత్తాల్లో డిపాజిట్లు స్వీకరించి మోసం చేశారు. సులభంగా ఉద్యోగాలు వస్తాయని ఎవరూ ఇలాంటి మోసపూరిత పథకాలను నమ్మవద్దని డీఎస్పీ ప్రమోద్ తెలిపారు. రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఐ సతీశ్ హత్యపై సీబీఐ విచారణ జరపాలి

- ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి
- కర్నూలులో కుమ్మరి కులస్థుల భారీ ర్యాలీ, ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సంఘం నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): టీటీడీ మాజీ ఏవీఎస్‌వో, జీఆర్పీ సీఐ సతీశ్ కుమార్ అనుమానాస్పద మృతిపై సీబీఐ దర్యాప్తు సంస్థతో విచారణ చేపట్టాలని కుమ్మరి శాలివాహన సంఘం నాయకులు, కులస్థులు డిమాండ్ చేశారు. శాలివాహన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కర్నూలులోని బీసీ భవన్ నుంచి కేసీ కెనాల్, మెడికల్ కాలేజీ, రాజ్ విహార్ మీదుగా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం సునయన ఆడిటోరియంలో జరుగుతున్న గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్ డాక్టర్ సిరికి నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్నాలో కర్నూలు జిల్లా శాలివాహన సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు, రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య, శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పీబీవీ సుబ్బయ్య మాట్లాడుతూ సతీష్ కుమార్‌ను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించిన టీటీడీ పరకామణిలో చోరీకి పాల్పడిన అనుమానితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సతీశ్ కుమార్ కుటుంబ సభ్యుల్లో ఒకరికి గ్రూప్-1 స్థాయి ఉద్యోగం ఇవ్వడంతో పాటు రూ.2 కోట్లు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే సతీష్ కుమార్ పిల్లలకు ఒకటో తరగతి నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ ధర్నాకు డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, సంఘం రాష్ట్ర అధ్యక్షులు మురళి మనోహర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేంపెంట రాంబాబు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా శాలివాహన సంక్షేమ సంఘం నాయకులు వై.నాగేశ్వరరావు, సోమేష్, 25 వార్డు ఓసీఎం రంగా, కే.మధు, చిన్న పుల్లయ్య, కే.లింగన్న, శ్రీనివాసులు, కేసీ నాగన్న, సుగూరు వెంకటేశ్వర్లు, కే.రమేష్, బీసీ, రజక వృత్తిదార్ల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పథకం ప్రకారమే సతీశ్ హత్య

- శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పేరేటి ఈశ్వర్

పత్తికొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జీఆర్పీ సీఐ సతీశ్ కుమార్‌ది పథకం ప్రకారం జరిగిన హత్యేనని శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పేరేటి ఈశ్వర్ ఆరోపించారు. సోమవారం కార్పొరేషన్ డైరెక్టర్లతో కలిసి పత్తికొండకు వచ్చిన ఆయన.. సతీశ్‌కుమార్ భార్య మమతోపాటు కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ టీటీడీ పరకామణి సంఘటనకు సంబంధించి నిజాయితీగా సతీశ్‌కుమార్ కేసు నమోదు చేశారన్నారు. అప్పటి ప్రభుత్వ పెద్దలు సతీశ్‌కుమార్‌పై ఒత్తిడితెచ్చి లోక్‌అదాలత్‌లో కేసు రాజీ చేయించారన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక హైకోర్టు పరిధిలోకి వెళ్లిన కేసు సీఐడీ విచారణకు రావడంతో మొదటి విడతగా సతీశ్‌కుమార్ చోరీ వివరాలను, ఒత్తిడి అంశాలను వారికి తెలియజేశారన్నారు. మరోసారి విచారణకు వెళ్తుండగా తమ పేర్లు బయటకు వస్తాయనే భయంతో అప్పటి ప్రభుత్వ పెద్దలు పథకం ప్రకారమే ఈ దారుణానికి ఒడిగట్టి ఉండవచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఏదిఏమైనా ఓ నిజాయితీ పోలీసు అధికారిని కోల్పోయామని సతీశ్‌కుమార్ హత్యని సీరియస్‌గా తీసుకొని విచారణ చేస్తుందన్నారు. అనంతరం శాలివాహన చైర్మన్ పేరేటి ఈశ్వర్, కార్పొరేషన్ డైరెక్టర్లు ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును కలిశారు. సతీశ్‌కుమార్ కుటుంబానికి అండగా నిలుస్తామని ఎమ్మెల్యే అన్నారు.



సతీశ్‌కుమార్ భార్య మమత, కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఈశ్వర్

తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే జైలు శిక్ష

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి



మాట్లాడుతున్న లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసి వారిని అనాథలుగా చేసే పిల్లలకు జైలు శిక్ష పడుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి తెలిపారు. నగరంలోని బి.క్యాంపు, మద్దూరునగర్‌లోని రెండు వృద్ధాశ్రమాలను ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఆయన వృద్ధులను చూసుకోవాల్సిన బాధ్యత వారి పిల్లలపై ఉందని, నిర్లక్ష్యం చేసిన వారి పిల్లలపై భరణం కేసులు దాఖలు చేసి భరణం రాబట్టుకునే హక్కు వృద్ధ తల్లిదండ్రులకు ఉంటుందని చెప్పారు. ఈ చట్టం ప్రకారం తల్లిదండ్రులను వదిలి వేస్తే మూడు నెలల జైలు శిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధించనున్నట్లు తెలిపారు. సంక్షేమ చట్టం-2007పై వృద్ధులకు అవగాహన కల్పించారు. వృద్ధులకు ఎవరికైనా న్యాయ సహాయం కావాలంటే వారు నేరుగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను గాని, టోల్ ఫ్రీ నెంబరు 15100కు ఫోన్ చేసి సమస్యలను చెప్పుకోవచ్చని తెలిపారు. బాధిత తల్లిదండ్రుల తరుపున జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉచితంగా న్యాయవాదిని నియమించిసమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ న్యాయవాది రాంపుల్లయ్య, సభ్యుడు డా.రాయపాటి శ్రీనివాస్, న్యాయవాది పాపారావు, కర్నూలు పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు మద్దిలేటి, ఆశ్రమ నిర్వహకులు పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితుడి అరెస్టు



నిందితుడి అరెస్టును చూపుతున్న పోలీసులు

బేతంచెర్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన సయ్యద్ మహబూబ్ బాషా అనే వ్యక్తిని ఈ నెల 12న హత్య చేసిన కేసులో నిందితుడు ముల్లకుర్తి మధు భూపాలుడు అలియాస్ మధుభూపాల్‌ను అరెస్టు చేసినట్లు సీఐ వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. రంగాపురం గ్రామం నుంచి మద్దిలేటి స్వామికి వెళ్లేదారిలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు కాశిరెడ్డి నాయన ఆశ్రమం వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. హత్యకు ఉపయోగించిన బల్లెంను నిందితుడి నుంచి స్వాదీనం చేసుకు న్నట్లు చెప్పారు. డోన్ కోరులో హాజరు పరుచగా మెజిస్ట్రేట్ 14 రోజుల జుడీషియల్ రిమాండ్‌కు ఆదేశించారని సీఐ తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

ఆస్పరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నహోతూరు బస్టాప్ వద్ద ముందు వెళ్తున్న లారీని తప్పించబోయిన మరో లారీ (ఆర్‌జే51జేబీ 6077) ప్రమాదానికి గురయ్యింది. బళ్లారి నుంచి నంద్యాలకు వెళ్తున్న లారీ విద్యుత్ విద్యుత్ స్తంభాన్ని సోమవారం బలంగా ఢీకొంది. రోడ్డు పక్కనే విద్యుత్ స్తంభానికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ బిగించి ఉండడంతో స్తంభాన్ని ఢీకొట్టిన లారీకి ఒక్కసారిగా మంటలు చెలరేగి వ్యాపించాయి. లారీ క్యాబిన్ దగ్ధమయ్యింది. పక్కనే రైతు బోయ రంగన్నకు చెందిన గడ్డివామికి నిప్పురవ్వలు ఎగిసి పడడంతో గడ్డివామి కూడా పూర్తిగా కాలిపోయింది. ఆలూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసింది. అంతలోపే లారీ, గడ్డివామి కాలిపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రాణహానీ జరగలేదని సీఐ గంగాధర్ తెలిపారు. రంగన్న గడ్డివామి దహనంకావడంతో రూ.50 వేలు నష్టం వాటిల్లిందని తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అలరించిన 'భువన విజయం'



'భువన విజయం' నాటకంలోని ఒక దృశ్యం

కర్నూలు కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి, ఏపీ నాటక అకాడమీ సౌజన్యంతో నగరంలోని మద్దూర్‌నగర్ లోగల పింగళి సూరన తెలుగుతోట సమావేశ హాలులో ప్రదర్శించిన 'భువన విజయం' పౌరాణిక పద్య నాటకం ఆకట్టుకుంది. జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుర్రపుశాల అంకయ్య ఆధ్వర్యంలో ఈ నాటక ప్రదర్శన జరిగింది. అష్టదిగ్గజ కవులతో కొలువుదీరిన శ్రీకృష్ణదేవరాయలు ఆయా కవుల పాండిత్యాన్ని వీనుల విందుగా వింటూ పరవశించిపోతాడు. ఈ భువన విజయంలో ఆయా పండితులు ఆలపించిన పద్యాలు వేటికవే పోటాపోటీగా కొనసాగాయి. బళ్లారి రాఘవ పురస్కార గ్రహీత రంగారెడ్డి శ్రీకృష్ణదేవరాయలుగా నటించగా, అల్లసాని పెద్దనగా శతావధాని గండ్లూరి దత్తాత్రేయ శర్మ, భట్టుమూర్తిగా శ్యామసుందర శాస్త్రి, అయ్యలరాజు రామభద్రకవిగా గుర్రపుశాల అంకయ్య, నంది తిమ్మనగా ఏలూరు యంగన్న, తిమ్మరుసుగా దత్తాత్రేయ శర్మ, ధూర్జటిగా జేఎస్ఆర్‌కే శర్మ, తెనాలి రామకృష్ణునిగా సూర్యనారాయణమూర్తి, పింగళి సూరనగా కేవీ మహీధరరావు, మాదయ్యగారి మల్లన్నగా ఎలమర్తి రమణయ్య నటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విద్యాసంస్థల అధినేత డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ జిల్లా ఖ్యాతిని చాటిచె ప్పేలా భువన విజయం నాటకం నిలుస్తుందని, కళాకారుల కృషి అభినందనీయమని అన్నారు.

పత్తి రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- కొనుగోలులో ఆటంకాలు లేకుండా చూడండి : కలెక్టర్ సిరి

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బంది పెట్టకుండా సమర్థవంతంగా పని చేయండని కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి మార్కెటింగ్, సీసీఐ అధికారులను ఆదేశించారు. సోమవారం గూడూరు మండలం పెంచికలపాడు గ్రామంలో మంజిత్ కాటన్ జిన్నింగ్ అండ్ ప్రాసెసింగ్ యూనిట్‌లో సీసీఐ ద్వారా జరుగుతున్న పత్తి కొనుగోలు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించి అధికారులు, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అందిన ఆదేశాల ప్రకారం ఎకరాకు 10 క్వింటాళ్ల వరకు పత్తిని కొనుగోలు చేయాలని సీసీఐ అధికారులను స్పష్టం చేశారు. రైతులకు కొనుగోలు ప్రక్రియలో జాప్యం లేకుండా ఎటువంటి ఆటంకాలు కల్పించకుండా కొనుగోలు చేయాలని సూచించారు. కపాస్ కిసాన్ యాప్‌లో ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ సమయం మరింత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా పత్తిలో తేమ శాతం 13 నుంచి 14 శాతం తేమ ఉన్నా కూడా పత్తిని కొనుగోలు చేయాలని సీసీఐ ప్రతినిధులకు సూచించారు. ఈ సందర్భంగా రైతులు పత్తి అమ్మకంలో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. వివిధ యాప్‌ల పేరుతో తాము సీసీఐ కేంద్రాన్ని అమ్ముకునేందుకు వీల్లేకుండా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కోసారి కపాస్ కిసాన్ యాప్ ఓపెన్ కావడం లేదని, అక్కడ స్లాట్ బుకింగ్ చేసుకున్నా కొనుగోలు కేంద్రాల వద్ద వెళ్లినప్పుడు తమకు డేట్ కన్ఫమ్ కాలేదని చెబుతున్నారని, దీని వల్ల తాము పత్తిని వెనక్కి తీసుకొని వెళ్లలేక అక్కడే మిల్లులో మద్దతు ధర కంటే తక్కువ ధరకు అమ్మాల్సిన పరిస్థితి ఎదురవుతుందని ఆవేదన చెందుతున్నారు. గ్రామాల్లో దళారులు, వ్యాపారులు తమ నుంచి పత్తిని కొనుగోలు చేస్తున్నారని, తమకు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తడం వల్లే వ్యాపారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చిందని రైతులు అంటున్నారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు మార్కెట్ కమిటీ సెక్రటరీ సుందర్‌రాజు, కర్నూలు జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి నారాయణమూర్తి ఉన్నారు.

మనసు మార్చుకున్న దొంగ..!

- దొరికిపోతానేమోనన్న భయంతో బాధితుల ఇంటి వద్దే బంగారం పడేసి వెళ్లిన వైనం

కొలిమిగుండ్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోరుమానుపల్లె గ్రామంలో ఈనెల 15న పట్టపగలే ఇంట్లో చొరబడి బంగారం చోరీ చేసిన దొంగ మనసు మార్చుకొని, ఆతర్వాత అక్కడే వదిలేసిపోయాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి జరిగింది. మారు తాళం చెవులు తీసుకొని తాళం ఓపెన్ చేసి దొంగతనానికి పాల్పడిన తీరుచూస్తే కచ్చితంగా అది తెలిసిన వారి పనేనని పోలీసులు భావించారు. పోలీసులు కేసుపై ప్రత్యేక దృష్టి సారించి, ఫింగర్ ప్రింట్ సేకరించారన్న సమాచారంతో.. తాను దొరికిపోతానేమో అనే భయంతో దొంగ చోరీ చేసిన నాలుగు తులాల బంగారాన్ని మొలక రాజారెడ్డి ఇంటి ఆవరణలో ఆదివారం అర్ధరాత్రి పడేసి పారిపోయాడు. ఈ క్రమంలో ఇంటి తలుపులపై రాళ్లతో కొట్టి శబ్దం చేసి డ్రామా సృష్టించాడు. రాజారెడ్డి కుటుంబ సభ్యులతో పాటు చుట్టు పక్కల వారు అర్ధరాత్రి నిద్రలేచి చూడగా చోరీ అయిన నాలుగు తులాల బంగారం రాజారెడ్డి ఇంటి ముందు కనిపించింది. దీంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

తల్లీ బిడ్డల మృతిపై ఆరా

- నందవరంలో వివరాలు సేకరించిన వైద్య బృందం


నందవరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నందవరానికి చెందిన తల్లీ బిడ్డల మృతి చెందిన ఘటనపై నందవరం వైద్యురాలు రేవతి, వైద్య బృందం సభ్యులు ఆరా తీశారు. సోమవారం నందవరంలో మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మౌనికను ప్రసవం నిమిత్తం ఈనెల 15న ఎమ్మిగనూరు ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు ఆమె భర్త జాన్, అత్త సుశీలమ్మ, మామ సుజ్ఞానం తెలిపారు. అక్కడ వైద్యులు మెరుగైన వైద్యసేవల కోసం కర్నూలు ఆసుపత్రికి వెళ్లాలని చెప్పారన్నారు. అయితే అంబులెన్స్ గంట ఆలస్యంగా వచ్చిందని, పైగా 30 కిలోమీటర్లు వరకే అనుమతి ఉందని వారు చెప్పడంతో వారిని ప్రాధేయపడే లోపు సమయం మరింత ఆలస్యం అయిందని చెప్పారు. దీంతో తల్లి, శిశువు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు.



నందవరంలో బాధిత కుటుంబ సభ్యులను ఆరా తీస్తున్న వైద్యులు

పాపయ్య కొండపై చిరుత

- ఫారెస్టు అధికారులు స్పందించాలని ప్రజల వినతి



పాపయ్య కొండపై కనిపిస్తున్న చిరుత పులి

కోసిగి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కోసిగి, నేలకోసిగి మధ్యలో ఉన్న పాపయ్య కొండపై సోమవారం ఉదయం చిరుతపులి స్థానిక రైతులకు, యువకుల కంట పడింది. కొండపైనే చిరుతపులి ఆవాసం ఏర్పాటు చేసుకుని గొర్రెలు, మేకలపై దాడులు చేస్తూ తీవ్ర నష్టం కలిగిస్తుందని గొర్రెల కాపరులు ఆవేదన వ్యక్తం చేశారు. ఫారెస్టు అధికారులు స్పందించి కొండపై ఉన్న చిరుత పులిని బంధించి తమకు రక్షణ కల్పించాలని కోరారు.

జీజీహెచ్‌కు నూతన డిప్యూటీ సూపరింటెండెంట్లు

● విధుల్లో చేరిన డా.లక్ష్మీబాయి, డా. నాగేశ్వరరావు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పరిపాలన విభాగాన్ని బలోపేతం చేసేందుకు ఇద్దరు సీనియర్ ప్రొఫెసర్లు డా. నాగేశ్వరరావు, డా.లక్ష్మీబాయిలను డిప్యూటీ సూపరింటెండెంట్లుగా నియమించారు.



ఉత్తర్వులు ఇస్తున్న సూపరింటెండెంట్

ఈమేరకు సూపరింటెండెంట్లు డా.కే. వెంకటేశ్వర్లు ఉత్తర్వులు జారీ చేశారు. సైక్రియాటీ ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ డా.ఎస్.నాగేశ్వరరావు జనరల్ మెడిసిన్ సీనియర్ ప్రొఫెసర్‌ను అధికారిక డిప్యూటీ సూపరింటెండెంట్లుగా నియమించారు. పరిపాలన పనితీరు విభాగాల మధ్య సమన్వయం మెరుగుపరచడం, రోగులకు మెరుగైన సేవలు అందించడం వీరి బాధ్యత అని సూపరింటెండెంట్ తెలిపారు.

ముమ్మరంగా రోడ్డు పనులు

సి.బెళగల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సీసీరోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. స్థానిక టీడీపీ నాయకులు బాలజీవెంకటేశ్, మాజీ ఎంపీటీసీ ధనుంజయుడు, ఈరన్నగౌడ్. గోవిందు రహదారి సమస్యను ఎమ్మెల్యే దస్తగిరి, కేడీసీసీబీ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లడంతో నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే, కేడీసీసీబీ చైర్మన్‌కు సన్మానం

:మండల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి, కేడీసీసీబీ చైర్మ్ విష్ణు వర్ధన్ రెడ్డిని టీడీపీ నాయకు లు సన్మానించారు. సోమవారం కలిశారు. అభివృద్ధికి కృషి చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. భీమన్న, గౌవుస్, చికెన్ ఈరన్న, రాజు పాల్గొన్నారు.



గజమాలవేస్తున్న టీడీపీ నాయకులు

గ్రంథాలయ సందర్శన దినచర్య కావాలి

కర్నూలు కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు గ్రంథాలయాల సందర్శన దినచర్య కావాలని, లయన్స్ క్లబ్ సీనియర్ కార్యదర్శి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు, సాయంత్రం కవి సమ్మేళనం నిర్వహించారు. రామ్మోహన్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాల్లో సభ్యత్వం తీసుకొని, ఉచితంగా పుస్తకాలు ఇంటికి తీసుకువెళ్లి చదువుకోవచ్చని సూచించారు.



పోటీలకు హాజరైన విద్యార్థులు

● సాయంత్రం నిర్వహించిన కవిసమ్మేళనం అలరింపజేసింది. 'పుస్తకం...నా నేస్తం' అనే అంశంపై నిర్వహించిన ఈ సమ్మేళనంలో కర్నూలుకు చెందిన పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు. కేజీ గంగాధర్‌రెడ్డి, జేఎస్ఆర్‌కే శర్మ, కవులు ముచ్చుకోట చంద్రశేఖర్, ఎస్ఎండీ ఇనాయతుల్లా, కెంగార మోహన్, జంధ్యాల రఘుబాబు, సయ్యద్ జహీర్ అహ్మద్, గద్వాల ఈరన్న, స్వరూప్ సిన్హా, కేవీ సుబ్బలక్ష్మమ్మ కవితలు వినిపించారు.

ఎన్జీవోస్ అసోసియేషన్‌ను బలోపేతం చేస్తాం



డీఈవో తో ఎన్జీవోస్ అసోసియేషన్ నాయకులు

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్‌ను బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని అసోసియేషన్ కర్నూలు నగర అధ్యక్షుడు ఎంసీ కాశన్న పిలుపునిచ్చారు. సోమవారం డీఈవో శామ్యూల్ పాల్‌తో పాటు ఆ కార్యాలయ సిబ్బందికి సభ్యత్వ నమోదు చేయించారు. కోడుమూరు తాలుకా అధ్యక్షుడు శ్రీనివాస యాదవ్, ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మద్దిలేటి, మెడికల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్‌చైర్మన్ ఈశ్వరయ్య, మహేంద్రబాబు పాల్గొన్నారు.

రేపు టెన్నికాయిట్ ఎంపిక పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బి.క్యాంపు సిల్వర్ జూబ్లీ కళాశాల క్రీడా మైదానంలో బుధవారం జిల్లా సబ్ జూనియర్, టెన్నికాయిట్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం కార్యదర్శి రమణ సోమవారం తెలిపారు. క్రీడాకారులు 01.01.2011 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. జనన ధృవీకరణ పత్రాలతో హాజరు కావలని, వివరాలకు 9398401721 నెంబర్లో సంప్రదించాలని కోరారు.

20న ధర్నాను జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ ఈ నెల 20న కలెక్టరేట్ వద్ద చేయనున్న ధర్నాను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.నరసింహులు పిలుపునిచ్చారు. సోమవారం బంగారుపేటలని సెంట్రింగ్ కార్యాలయంలో మాట్లాడుతూ 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసిందని విమర్శించారు. టీడీపీ ఇచ్చిన హామీ మేరకు పునరుద్ధరించాలన్నారు. మాబాషా, రామక్రిష్ణ, నరేష్, దస్తగిరి, దేవదాస్ తదితరులు పాల్గొన్నారు

ప్రైవేటీకరణను విరమించుకోవాలి


కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వైద్య కళాశాలల ప్రైవేటీకరణను విరమించుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రబాబు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ఖాళీ ప్లేట్లతో భిక్షాటన చేస్తూ నిరసన తెలియజేశారు. పీపీపీ నిర్వహణకు కేబినెట్ సమావేశంలో నిర్ణయించడం సరికాదన్నారు. మెడికల్ కళాశాలలను నిర్వహించలేమని, జాతీయ మెడికల్ కౌన్సిల్‌కు లేఖ రాయడం వల్ల 2024-25 విద్యాసంవత్సరంలో 1,800 మెడికల్ సీట్లు పేద విద్యార్థులు కోల్పోయారన్నారు. ఈ కార్యక్రమంలో అఖండ, రమణ, నరసింహ, అస్లాం, జనార్దన్, జక్రి తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి రైతుకు సీఎం అండ

● సీఎం చంద్రబాబు విజ్ఞప్తి మేరకు జిల్లాలో పర్యటించనున్న కేంద్ర బృందం
● అనంతరం నివేదిక ఇవ్వనున్న అధికారులు



కోడుమూరులో ఆరబోసిన ఉల్లి (ఫైల్)



ఉల్లిరైతుల కష్టాలను గమనించిన చంద్రబాబు క్వింటం రూ.1,200 ప్రకారం కొనుగోలు చేసి, హెక్టారుకు రూ.50వేల సాయం ప్రకటించారు. అనంతరం వారి సమస్యలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లడంతో కేంద్ర బృందం నేడు జిల్లాలో పర్యటించనుంది.

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉల్లిరైతుల కష్టాలను తీర్చేందుకు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి మేరకు కేంద్ర ప్రభుత్వం తరపున ఢిల్లీ నుంచి ప్రత్యేకాధికారులు జిల్లాలో పర్యటించనున్నారు. ఉమ్మడి జిల్లాలో ఉల్లి సాగు విస్తీర్ణం ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో దాదాపు 50వేల ఎకరాల్లో సాగవుతుంది.

ప్రతి ఏడాదీ నష్టపోతున్న రైతులు

ఉల్లి సాగు చేసిన రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. అటు పంట రాకపోవడమో దిగుబడి వచ్చినా ధర లేక నష్టపోతున్నారు. ఎకరాకు రూ.50వేల నుంచి రూ.60వేల పెట్టుబడి పెట్టినా కనీసం రవాణా ఖర్చులు కూడా రావడం లేదు. ఈ ఏడాది అధిక వర్షాలు, మొంథా తుఫాను ప్రభావంతో ఉల్లి దెబ్బతింది.

కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన సీఎం

రైతుల కష్టాలు గమనించిన సీఎం చంద్రబాబు క్వింటం రూ.1,200ల చొప్పున మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయించారు. అదే విధంగా హెక్టారుకు రూ.50వేల పరిహారాన్ని అందించేందుకు నిర్ణయించారు. ఇందులో భాగంగా ఉల్లి రైతుల కష్టాలను తొలగించేందుకు శాశ్వత పరిష్కారాన్ని చూడాలని ప్రధాని మోదీని కోరారు. దీంతో కేంద్రం నుంచి 5 మంది వివిధ విభాగాలకు చెందిన అధికారులు ఈ నెల 18న కర్నూలు జిల్లాలోని కోడుమూరు, గోనెగండ్ల మండలాల్లో పర్యటించనున్నట్లు కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు. 18న మధ్యాహ్నం కర్నూలు స్టేట్ గెస్టహౌస్‌కు చేరుకుని కోడుమూరు మండలం ప్యాలకుర్తి, గోనెగండ్ల మండలం గాజులదిన్నె, హైచ్‌కైరవాడి, గోనెగొండ్ల మండలాల్లో పర్యటిస్తారు. అనంతరం నంద్యాల జిల్లాకు బయలుదేరి వెళతారని ఉద్యాన శాఖ జిల్లా అధికారి కృష్ణవ ర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్ర బృందంలో డా.బీజే బ్రహ్మ, ఉద్యాన శాఖ డివిజన్ డిప్యూటీ కమిషనర్‌తో పాటు కే.మనోజ్, అదే విభాగానికి చెందిన సెక్రటరీతో పాటు రాజీవ్ కుమార్, డిప్యూటీ డైరెక్టర్ హేమాంగ భార్గవ్, అసిస్టెంట్ డైరెక్టర్ శరవన్నన్, కేంద్ర ఉద్యాన శాఖ అధికారి ఉన్నారు. వీరు క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకుని కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇస్తారని కలెక్టర్ వివరించారు.

గ్లోబల్ సమ్మిట్‌తో రాష్ట్రానికి పెట్టుబడులు

● కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు రూరల్ నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో నిర్వహిస్తున్న గ్లోబల్ సమ్మిట్‌తో రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్దిని వేగవంతం చేయడానికి దూరదృష్టితో సీఎం చంద్రబాబు గొప్ప నిర్ణయం తీసుకున్నారన్నారు. పరిశ్రమలు, ఇన్నోవేషన్, ఐటీ, తయారీ రంగాలపై పెట్టుబడుదారులు ఆసక్తి చూపించడం హర్షనీయమన్నారు. సదస్సులో మూడు రోజుల్లో 13లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులకు సుమారు రూ.16లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు.



కార్తీక మాసం చివరి సోమవారం పూజలు



మాట్లాడుతున్న పుల్లారెడ్డి స్కూల్ కరస్పాండెంట్ గోపాల్‌రెడ్డి

కర్నూలు కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి సోమవారం ఆలయల్లో పూజలు నిర్వహించారు. పాత నగరంలోని చిన్న అమ్మవారిశాలలో ధన్వంతరి జయంతి సందర్భంగా ఆరోగ్యభారతి కార్యదర్శి స్వప్నసారధి ఆధ్వర్యంలో ధన్వంతరి స్వామికి పంచామృతాభిషేకములు చేశారు. బళ్లారి రోడ్డులోని వాసవీనగర్‌లోగల వేంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ మాతృశక్తి కన్వీనర్ హేమలత ఆధ్వర్యంలో బాలలకు భగవద్గీత పఠనం, కోలాటం ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో పుల్లారెడ్డి స్కూల్ కరస్పాండెంట్ గోపాలరెడ్డి, అనురాధ, దేవాలయ కమిటీ ప్రతినిధులు యలిశెట్టి రమేష్, వేణుగోపాల్, వీహెచ్‌పీ సత్సంగ్ ప్రముఖ్ వేముల కృష్ణపరమాత్మ పాల్గొన్నారు. జగన్నాథగట్టుపై వెలసిన రూపాల సంగమేశ్వ స్వామి క్షేత్రంలో కార్తీక మాసం చివరి సోమవారం పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కిడ్స్ వరల్డ్ సమీపంలోని గోసంరక్షణ శాలలో సామూహిక దీపోత్సవాలు నిర్వహించారు.



గోసంరక్షణశాలలో సామూహిక కార్తీక దీపోత్సంలో పాల్గొన్న మహిళలు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కోడుమూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 58వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి అశోక్ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం, గత చరిత్రను తెలుసుకుంటే విజ్ఞానం పెరుగుతుందని తెలిపారు. హెచ్‌ఎం రామచంద్రుడు పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

డాక్టర్స్ ప్రీమియం లీగ్ విజేత డెంటల్ స్ట్రైకర్స్



డెంటల్ స్ట్రైకర్స్ జట్టుతో డా.గోవిందరెడ్డి, డా.అమరసింహారెడ్డి

కర్నూలు హాస్పిటల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): 42 రోజులుగా కర్నూలులో నిర్వహించిన డాక్టర్స్ ప్రీమియర్ లీగ్ ఫైనల్‌లో కర్నూలు డెంటల్ స్ట్రైకర్స్ జట్టు విజేతగా నిలిచింది. రాయల్ స్పోర్ట్స్ గ్రౌండులో జరిగిన పోటీల్లో కేఎంసీ అల్యూమి మరియు కర్నూలు డెంటల్ స్ట్రైకర్స్ జట్లు తలపడ్డాయి. మొదటి బ్యాటింగ్ చేసిన కర్నూలు డెంటల్ స్ట్రైకర్స్ 20 ఓవర్లలో 165 పరుగులు చేసింది. ఇందులో డా.రాఘవేంద్ర రెడ్డి 40 పరుగులు అత్యధికంగా చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు మెడికల్ కాలేజీ అల్యూమి జట్టు 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 140 పరుగులు మాత్రమే చేయడంతో 26 పరుగుల తేడాతో డెంటల్ స్ట్రైకర్స్ జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు కేప్టన్ డా.రాఘవేంద్ర రెడ్డికి రన్నర్ అయిన కేఎంసీ అల్యూమి కేప్టెన్ డా.రవి కళాధర్ రెడ్డికి జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు మెన్స్ జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు డా.గోవిందరెడ్డి, ఉమెన్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డా.లక్కిరెడ్డి అమరసింహారెడ్డి ట్రోఫీని అందజేశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా డా.వై.రాఘవేంద్ర రెడ్డి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా ఉత్తమ బౌలర్‌గా డా.రమేష్ గౌడు, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా డా.సుభాష్; ఉత్తమ ఫీల్డర్‌గా డా.గౌస్ ఎంపికయ్యారు.

గ్రంథాలయాలు భవిష్యత్తుకు దిక్సూచి



ర్యాలీలో పాల్గొన్న ఇన్‌చార్జి రిజిస్ట్రార్, విద్యార్థులు

కర్నూలు అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రంథాయాలు భవిష్యత్ తరాలకు దిక్సూచి అని ఇన్‌చార్జి రిజిస్ట్రార్ జి. శ్రీనివాస్ అన్నారు. సోమవారం క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పుస్తక ప్రదర్శన, గ్రంథాలయాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

కుష్ఠు నిర్ధారణ పరీక్షలు

కోడుమూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కుష్ఠు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వైద్య బృందం కోట వీధిలోని ఇంటింటికి తిరిగి సర్వే చేశారు. వైద్యాధికారి శ్రీమంత్ మాదన్న మాట్లాడుతూ చర్మంపై స్పర్శ లేని, రాగి రంగు మచ్చలు, కనురెప్పలు, కనుబొమ్మలపై వెంట్రుకలు రాలిపోవడం, కనురెప్ప మూత పడకపోవడం, చేతులు నుంచి వస్తువులు జారిపడిపోవడం, చల్లని, లేదా వేడి వస్తువుల స్పర్శ తెలియకపోవడం కనిపిస్తే పరీక్ష చేయించుకోవాలన్నారు. కృష్ణమోహన్, కమాల్, ఉమాబాయ్ ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రేపు సర్పంచు, ఉప సర్పంచులకు శిక్షణ

కర్నూలు రూరల్ నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచు, ఉపసర్పంచు, పంచాయతీ కార్యదర్శులకు బుధవారం శిక్షణ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రఘునాథ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఎల్ఎస్‌డిజీ థీం-5, పర్యావరణ పరిరక్షణ, పచ్చదనాన్ని పెంపొందించడం అనే అంశంపై ఉదయం 9-30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరగనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. కావున ఈ శిక్షణ కార్యక్రమానికి ప్రతి గ్రామ సర్పంచు, ఉపసర్పంచు, పంచాయతీ కార్యదర్శి తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

పెండింగ్ జీతాలు ఇవ్వాలి

కర్నూలు హాస్పిటల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):తమకు పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం జీజీహెచ్, మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, కంటి ఆసుపత్రిలో పని చేస్తున్న కార్మికులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు సొలోమాన్ రాజు మాట్లాడుతూ జీవో.నెంబర్.549 ప్రకారం రూ.16వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ వర్క్ మెటీరియల్ సేఫ్టీ మెటీరియల్ ఇవ్వాలని కోరారు. 2 నెలల పెండింగ్‌లో ఉన్న జీతాలు ఏజెన్సీ ఇవ్వాలన్నారు.

ఆక్రమణలను తొలగించాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగర పాలక పరిధిలోని 45వ వార్డులో రహదారి ఆక్రమణలను తక్షణమే తొలగించి రోడ్డు వెడల్పు చేయాలని కాలనీ వాసులు కోరారు. ప్రజా పరిష్కార వేదికలో కమిషనర్ పి.విశ్వనాథ్‌కు వినతి పత్రం అందజేశారు. స్థానికులు నాగేంద్ర, విజయకుమార్ మాట్లాడుతూ కాలనీలోని ట్రినిటీ పాఠశాల నుంచి రహదారి ఆక్రమణకు గురై ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. స్పందించిన కమిషనర్ సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి.కృష్ణ, డిప్యూటి కమిషనర్ సతీష్ కుమార్‌రెడ్డి, మేనేజర్ ఎన్.చిన్న రాముడు, ఇంచార్జి ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్‌రెడ్డి, డీసీపీ వెంకట రమణ, ఆర్‌వో స్వర్ణలత, కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

మైనర్లు నడిపితే వాహనాలు సీజ్

సి.బెళగల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మైనర్లు నడిపితే వాహనాలను సీజ్ చేస్తామని ఎస్ఐ వేణుగోపాల్‌రాజు హెచ్చరించారు. సోమవారం స్థానిక పాతబస్టాండు అవరణలో వాహన దారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మొదటసారి పట్టుబడితే రూ.5వేలు, రెండో సారి పట్టుబడితే వాహనాలను సీజ్ చేస్తానని హెచ్చరించారు.

స్థానికులకే ఉద్యోగాలివ్వాలి

ఓర్వకల్లు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. సోమవారం మాట్లాడుతూ ఈ నెల 19న తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా చేపట్టే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆటో జాతాను మండలంలోని నన్నూరు గ్రామంలో జెండా ఊపి గౌస్ దేశాయ్ ప్రారంభించారు. నాగన్న, మధుసూదన్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కర్నూలు క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల మేరకు.. వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన వ్యక్తి పేకాట నిర్వహిస్తున్నట్లు గుర్తించి దాడులు చేశారు. ఇద్దరు పరారు కాగా, మొత్తం నలుగురిని అదుపులోకి తీసు కుని, రూ.13వేలు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తేజమూర్తి తెలిపారు.

ట్రావెల్స్, విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి



వినతి పత్రం అందజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖ నిబంధనలు పాటించని ప్రైవేటు ట్రావెల్, విద్యాసంస్థల బస్సుల యజమానులపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రజా పరిష్కార వేదికలో కలెక్టర్ డా.సిరికి వినతి పత్రం అందజేశారు. నగర కార్యదర్శి బీసన్న తదితరులు పాల్గొన్నారు.

● పంచాయతీలకు ఇవ్వాల్సిన స్టాండపు డ్యూటీలు వెంటనే చెల్లించాలని సర్పంచులు డీఆర్ఓ వెంకటనారాయణమ్మకు వినతి పత్రం అందజేశారు. ఈ.తాండ్రపాడు, దేవమాడ, దిన్నెదేవరపాడు, నందనపల్లె సర్పంచులు బాలపీరా, ఈశ్వరయ్య, మాధవస్వామి, మాధురి ఉన్నారు.

● పబ్లిక్ పరీక్షలు విద్యార్థులకు సైకాలజిస్టులు, విద్యానిపుణులు, కేరీర్ కౌన్సిలర్లతో సదస్సు నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఉదయ్, రంగప్ప స్పెషల్ కలెక్టర్ అనురాధకు వినతి పత్రం అందజేశారు.

● చనిపోయిన కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలనీ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరిని వినతి పత్రం అందజేశారు.

● వెంకాయపల్లి ఇందిరమ్మ కాలనీలో బీడీ కార్మికుల కాలనీలో రోడ్డు, మౌళిక వసతులు కల్పించాలని నాయకులు పి.ఇక్బాల్ హుస్సేన్, అబ్దుల్ దేశాయ్ కోరారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

సి.బెళగల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే వీఆర్వోలపై చర్యలు తప్పవని తహసీల్దార్ వెంకటలక్ష్మి హెచ్చరించారు. సోమవారం ప్రజాఫిర్యాదుకు మండలస్థాయి అధికారులు హాజరుకాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం ఏశారు. ఈ విషయాన్ని జిఆల్ల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెల్తానని తెలిపారు. ఎంఈవో ఆదాం బాషా, ఏవో మల్లేష్‌కుమార్, హౌసింగ్ ఏఈ సమంత్ ఉన్నారు.



తహసీల్దార్‌కు విన్నవిస్తున్న రైతులు

పెన్షనర్లకు ద్రోహం చేస్తే మనుగడ ఉండదు

● ఈపీఎఫ్ కార్యాలయం వద్ద పెన్షనర్ల నిరసన

కర్నూలు న్యూసిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు పెన్షనర్లకు ద్రోహం చేస్తే వాటి మనుగడ సాగదని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నాయకులు హెచ్చరించారు. సోమవారం ఈపీఎఫ్ 95 విద్రోహ దినాన్ని పురస్కరించుకుని అశోక్‌నగర్ ఈపీఎఫ్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. రాష్ట్ర కమిటీ సభ్యులు కే.సుధాకరప్ప అధ్యక్షత వహించారు. ఆర్టీసీ విశ్రాంత ఈయూ నాయ కులు జె.దివాకర్, బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి యాకోబు మాట్లా డుతూ కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని అడుగుతున్నా పట్టించు కోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈఎస్ఐ ఆసుపత్రులలో ఉచిత వైద్యం, రైల్వే ప్రయాణాల్లో రాయితీలను పునరుద్ధరించాలని, ఆరోగ్యశ్రీ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహేశ్వరరావు, సీఐటీయూ నాయకులు సాయిబాబ, మద్దిలేటి, బసయ్య, యాగం టయ్య, మోహన్, సూర్య నారాయణరావు పాల్గొన్నారు



నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

ఫీజులు విడుదల చేయాలి



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న జేఏసీ నాయకులు

కర్నూలు కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీఈ కింద చదువుతున్న విద్యార్థుల ఫీజులు విడుదల చేయాలని విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ కోనేటి వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎజీఆర్ఎస్‌లో డీఆర్వో వెంకట నారాయణమ్మకు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో విద్యాహక్కు చట్టం-2009 పర్యవేక్షణకు కమిటీ ఏర్పాటు చేయాలని, ఫీజు పరిమితిని రూ.30 వేలకు పెంచి, 'తల్లికి వందనం' పథకాన్ని ఆర్టీఈ విద్యార్థులకు కూడా వర్తింపజేయాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు ఆనంద్‌బాబు, ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి నాగరాజు, రాయలసీమ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సీమ కృష్ణ రాథోడ్, ప్రోగ్రెసివ్ రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ ఆసుపత్రికి ఎమ్మెల్యే రాక

పత్తికొండ టౌన్, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా మంజూరైన డిజిటల్ ఎక్స్‌రే యూనిట్‌ను మంగళవారం ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్ చేతులమీదుగా ప్రారంభిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కల్పన తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఆధునిక ఎక్స్‌రే యూనిట్ ద్వారా అనేక వ్యాధులకు సంబంధించిన కేసులను వేగంగా గుర్తించవచ్చునన్నారు. ఎక్స్‌రే యూనిట్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే హాజరై ప్రారంభిస్తారన్నారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

15మందికి జైలు శిక్ష

● 19మందికి రూ.10వేలు జరిమానా

ఆదోని రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలను నడుపుతూ, పట్టుబడ్డ మందుబాబులకు ఆదోని కోర్టు ముప్పై రోజులపాటు జైలు శిక్ష విధించింది. సోమవారం తాలుక పరిధిలో పట్టుపడ్డ 5మందికి, ట్రాఫిక్ స్టేషన్‌లో పట్టుపడ్డ నలుగురికి, వన్‌టౌన్‌లో ఒకరికి, టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పట్టుపడ్డ 5మందికి ముప్పై రోజులపాటు జైలు శిక్ష విధిస్తూ, ఆదోని ఫస్ట్ అడిషనల్ జెఎఫ్‌సిఎం జడ్జి లీలా సాయి శుభాష్ తీర్పు ఇచ్చారని కోర్టు లైజినింగ్ ఎఎస్‌ఐ నరసింహులు తెలిపారు. అదేవిధంగా మరో 19మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు

చిప్పగిరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తప్పవని చిప్పగిరి ఎస్‌ఐ సతీశ్ కుమార్ హెచ్చరించారు. సోమవారం సాయంత్రం స్థానిక విజయదాసరకట్ట సమీపంలో సిబ్బందితో కలిసి ఎస్‌ఐ వాహనాల తనిఖీ నిర్వహించి డ్రంకెన్ డ్రైవ్ చేపట్టారు. మురళీకృష్ణ, శంకర్ పాల్గొన్నారు.

'ప్రభుత్వ స్థలాలను కాపాడాలి'


ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పత్తికొండ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెద్దహుల్తి లేఅవుట్‌లో విలువైన స్థలాలు కబ్జాదారులు ఆక్రమించుకున్నారని, ప్రభుత్వ స్థలాలను కాపాడాలని సీపీఎం మండల నాయకులు సురేంద్ర, బ్రహ్మయ్యలు అధికారులను కోరారు. సోమవారం స్థానిక ఆర్డీఓ భరత్‌నాయక్‌కు సీపీఎం బృందం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జూటూరు రెవెన్యూ పరిధిలో సర్వేనంబర్ 130/2లో నివాస స్థలాలను పెద్దహుల్తి గ్రామ నిరుపేదలకు కేటాయించడం జరిగిందన్నారు. అయితే కొంతమంది కబ్జాదారులు రెవెన్యూ అధికారులు కుమ్మక్కై ఆ స్థలాలను అడ్డదారిలో పట్టాలు సృష్టించుకుని స్థలాలను ఆక్రమించుకున్నారన్నారు. కబ్జాదారులపై, రెవెన్యూ అధికారులపై సమగ్ర విచారణ జరిపి, ప్రభుత్వ స్థలాలను కాపాడాలన్నారు. నాయకులు నరసింహులు, రాముడు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష దీపోత్సవం

● కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో శైవాలయాలకు పోటెత్తిన భక్తులు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు


దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

వెల్దుర్తి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వెల్దుర్తి జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాలలో సోమవారం మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడు ఆధ్వర్యంలో 'దామోదర కార్తీక దామోదర లక్షదీపోత్సవం' కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం(ఇస్కాన్) పూజశ్రీ రూపేశ్వర చైతన్యదాస్, వైష్ణవ కృపదాస్, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, శివసాయిబాబా కాల్వబుగ్గ హాజరయ్యారు. మహిళలు కుటుంబసమేతంగా హాజరై దీపాలను వెలిగించారు. అశేషంగా వచ్చిన ప్రజలకు అన్నదానం, ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో రఘునందన సేకవదాసు, రామాంజనేయులు, తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ, ఎంపీడీఓ సుహాసినమ్మ, డిప్యూటీ ఎంపీడీఓ రవికిశోర్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనాథ్ పాల్గొన్నారు.

మద్దికెర: మండల కేంద్రమైన మద్దికెర గ్రామానికి 3 కిలోమీటర్ల దూరంలో వెలసిన బుగ్గ సంగమేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం సోమవారం పురస్కరించుకుని పూజలు చేశారు. ఉదయం బుగ్గ సంగమేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు

రోడ్డు నిర్మాణం చేపట్టాలి

ఆదోని, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆదోని మండల పరిధిలోని ఢణాపురం నుంచి హొళగుంద వరకు ఉన్న 28 కిలో మీటర్ల రోడ్డు అధ్వానంగా మారి గుంతలమయంగా మారడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు అత్యవసర సేవలకుఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట డీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉదయ్, రాష్ట్ర కార్యదర్శి బాలు, వీరేష్, రవి, మహానంది ధర్నా నిర్వహించారు.వినతిపై స్పందించిన సబ్‌కలెక్టర్ వచ్చే నెలలో పనులు మొదలు పెట్టి జనవరిలోపు ఢణాపురం నుంచి హొళగుంద వరకు రోడ్డు నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

దేవనకొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26 వరకు జరిగే ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జ్యోతి తెలిపారు. మండలంలోని పాఠశాలలో చదివే విద్యార్థులు, ప్రజలు ఆధార్ ఈకెవైసీ చేసుకోవాలన్నారు. గ్రామాలకు కేటాయించిన తేదీలలో జెడ్పీ పాఠశాల వద్దకు వెళ్తే సచివాలయ సిబ్బందితో ఆధార్ అప్డేట్ చేయడం జరుగుతుందన్నారు.

ఈకేవైసీ పూర్తి చేయాలి

తుగ్గలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనులకు వచ్చే ప్రతి కూలీచేత ఈకేవైసీ చేయించాలని ఏపీవో హేమసుందర్ సూచించారు. సోమవారం మండల కేంద్రమైన తుగ్గలి ఏపీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద పనులకు వచ్చే కూలీలందరూ ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

తప్పులు లేకుండా రీసర్వే చేయాలి

తుగ్గలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం నిర్వహించే రీసర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా రీసర్వే చేయాలని తహసీల్దార్ రవి సూచించారు. సోమవారం మండల కేంద్రమైన తుగ్గలిలో ఆయన మాట్లాడుతూ మండలంలో బొందిమడుగులలో జరుగుతున్న రీసర్వేలో పకడ్బందీగా నిర్వహించాలని, రీసర్వేకు వెళ్లే పొలాల రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే తప్పులు లేకుండా సర్వే నిర్వహించి రికార్డులో నమోదు చేయాలన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని సవరించాలి

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : విద్యాహక్కు చట్ట సవరణ ద్వారా ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయించాలని ఎస్టీయూ నాయకుడు హనుమన్న ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో నాగేంద్రప్ప అధ్యక్షతన ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల పక్షాన రివ్యూ పిటిషన్ సుప్రీంకోర్టులో వేయాలన్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కాశీ విశ్వనాథ్ శాస్త్రి, శ్రీనివాసులు, జ్యోతి మూర్తి, ఎం శ్రీనివాసులు, తిమ్మప్ప పాల్గొన్నారు.

● అకాడమిక్ ఇన్స్‌స్ట్రక్టర్‌ల మంజూరుకు కృషి చేయాలి

ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉన్న చోట అకాడమిక్ ఇన్స్‌ట్రక్టర్‌లను మంజూరు కృషి చేయాలని ఎస్టీయూ పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్ కోరారు. సోమవారం విజయవాడలో ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ్ రెడ్డిని కలిసి ఆయన ప్రతిపాదన చేశారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం: ఎమ్మెల్యే

క్రిష్ణగిరి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం కృషిచేస్తోందని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. సోమవారం తొగర్చేడు, టీ.గోకులపాడు గ్రామాలకు సుమారు రూ.3 కోట్ల తో వేసిన నూతన బీటీ రోడ్లను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. నియోజకవర్గంలోసౌకర్యాల కల్పించడానికి కృషిచేస్తామని అన్నారు. కార్యక్రమంలో పత్తికొండ మార్కెట్‌యార్డు ఛైర్మన్ ఆలంకొండ నబిసాహెబ్, ఉప్పర సంఘం రాష్ట్ర డైరెక్టర్ ఎల్వీప్రసాద్, మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడు, మండలాధ్యక్షులు దామోదర్‌నాయుడు, బలరాంగౌడు, సీనియర్ నాయకులు మద్దిశ్రీరాములు, సర్పంచులు చిన్నరామాంజనేయులు, రేణుక పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు:స్వగ్రామమైన కంబాలపాడు చెరువు కట్టపై నూతనంగా నిర్మించిన గంగమ్మ తల్లి దేవాలయాన్ని దర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

ఆస్పరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ములుగుందం గ్రామంలో వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు సోమవారం గ్రామపెద్దల సమక్షంలో భూమిపూజ నిర్వహించారు. గ్రామంగుండా వెళ్తున్న ఆదోని-తెర్నెకల్ రోడ్డు పక్కలో నీళ్ల ట్యాంకు వద్ద విగ్రహ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. నరసప్ప, జయరాముడు, శివన్న, నాగరాజు పాల్గొన్నారు.

తరగతి గదుల నిర్మాణాన్ని పూర్తి చేయాలి

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాల నెహ్రూ మెమోరియల్ ఉన్న పాఠశాలల్లో నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని సీపీఎం జిల్లా సీనియర్ నాయకుడు ఈరన్న, పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, అజీమ్ ఖాన్ కోరారు. సోమవారం రాష్ట్ర పరీక్షల విభాగం డైరెక్టర్ గోవింద్ నాయక్ పాఠశాలలను పరిశీలించేందుకు ఆదోనికి రావడంతో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని కోరారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి పత్తి రైతుల సమ్మేళనం

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : నేటి నుంచి రెండు రోజులపాటు ఆదోనిలో రాష్ట్ర స్థాయి పత్తి రైతుల సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామని ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి టి. వీరేష్ అన్నారు. సోమవారం భీమాస్ హాల్లో పత్తి సమ్మేళనంపై విలేకరుల సమావేశం జరిగింది. రెండు రోజులపాటు రోషన్ గార్డెన్‌లో రాష్ట్ర స్థాయి పత్తి రైతుల సమ్మేళనానికి రాష్ట్రంలోని ఉన్న పత్తి రైతులతో పాటు రైతు సంఘం గౌరవ అధ్యక్షులు రామచంద్రయ్య, అఖిలభారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, మాజీ వ్యవసాయశాఖ మంత్రి రఘువీరారెడ్డి తోపాటు ఈశ్వరయ్య, రాజన్ క్షీరసాగర్, గిడ్డయ్య, జగన్నాథం, నాగేంద్రయ్యతోపాటు పులువురు పాల్గొంటారన్నారు. రైతు సంఘం నాయకులు బసాపురం గోపాల్, పంపన్న గౌడ్ పాల్గొన్నారు.

మద్దికెర:ఆదోని పట్టణంలో ఈ నెల 18, 19 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగే పత్తి రైతుల రాష్ట్ర సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని తాలుకా రైతు సంఘం కార్యదర్శి కారన్న, మండల సీపీఐ కార్యదర్శి నాగరాజు కోరారు. నాగిరెడ్డి, నెట్టి కంటయ్య తదితరులు ఉన్నారు.

అనుమానాస్పద మృతిని ఛేదించాలి

పత్తికొండ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పరకామణి చోరీ కేసులో కీలక సాక్షిదారి ప్రస్తుత రైల్వే సీఐ సతీశ్‌కుమార్ అనుమానస్పద మృతిపై నిగ్గు తేల్చాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి క్రాంతినాయుడు డిమాండ్ చేశారు. సోమవారం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆయన ఆర్డీఓ భరత్‌నాయక్‌కు అందజేశారు. మాజీ టీటీడీ ఏవీఎస్‌ఓ సతీష్‌కుమార్ అనుమానస్పద మరణంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ ఆ కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా, ఐదు ఎకరాల భూమిని అందించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. నాయకులు సుల్తాన్, రహంతుల్లా, కృష్ణ పాల్గొన్నారు.

ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషి చేయాలి

ఆలూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గోవింద్ నాయక్ సూచించారు. సోమవారం ఆలూరు పట్టణంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఆయన ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. గత ఏడాది ఫలితాల్లో వెనుకబడి ఉందని, ఈసారి వంద శాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. ఎంఈఓలు కోమలాదేవి, చిరంజీవిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఖాన్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు సన్మానం

ఆదోని టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : జర్నలిస్ట్ డే సందర్భంగా సోమవారం ఆవోపా, వామ్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా సౌజన్యంతో స్థానిక సీనియర్ జర్నలిస్టులు విజయేంద్రప్రసాద్, ఉరుకుందప్ప, రఘు, మునెప్ప, రాము, వెంకటేష్, బాషాలను సన్మానించారు

డ్రంకెన్ డ్రైవ్‌లో వైసీపీ నాయకుడికి జరిమానా

పత్తికొండ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):డ్రంకెన్ డ్రైవ్ కేసులో వైసీపీ పట్టణ మైనార్టీ అధ్యక్షుడు సాఫ్‌డీన్ నూర్‌బాషాకు కోర్టు రూ.10 వేలు జరిమానా విధించిందని రూరల్ సీఐ పులిశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ శనివారం రాత్రి పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ కింద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా సదరు వైసీపీ నాయకుడు వాహనం నిలుపకుండా వేగంగా వెళ్లిపోయాడన్నారు. దీంతో ఆయన వాహనాన్ని వెంబడించి పాతపేట ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నామన్నారు. నిబంధనల ప్రకారం డ్రంకన్‌డ్రైవ్ పరీక్ష చేయగా భారీగా మద్యం తాగినట్లు తేలిందన్నారు. కేసు నమోదుచేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి జోష్న రూ.10 వేలు జరిమానా విధించారన్నారు.

స్వామిత్వపై గ్రామసభ

హొళగుంద, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : హొళగుంద మండల పరిధిలోని నాగరకన్విలో స్వామిత్వ కార్యక్రమం పై గ్రామసభ నిర్వహించినట్లు డీఎల్‌డీవో బాలకృష్ణ రెడ్డి సోమవారం తెలిపారు. ఆస్తులకు సంబంధించి గ్రామీణుల వద్ద ఉన్న ఆధారాలను పరిగణలోకి తీసుకొని, ఏవైనా అభ్యంతరాలు ఉంటే, నమోదు చేస్తామన్నారు. వీటిని వారంలోపు పరిష్కరిస్తామన్నారు. పరిష్కారం కానట్లు అయితే ఫారం-19 ద్వారా అప్పీలు చేసుకొని రీ-సర్వే కోసం డిప్యూటీ తహసీల్దారుకు పంపిస్తారు. సభకు రాని వారి ఇంటింటికీ వెళ్లి సంతకాలు తీసుకుంటారు. యజమానుల సమాచారం లేకపోతే ఇంటి పన్ను వివరాలను యథాతథంగా పరిగణిస్తారు. ఆధార్, మొబైల్, డాక్యుమెంట్స్ మొదలైన వివరాలను సేకరించి డిజిటలైజేషన్ చేస్తారు. సభలో తీర్మానం చేసి, గ్రామ సబ్ రిజిస్టర్‌లో నమోదు చేస్తామన్నారు. డిప్యూటీ ఎంపీడీవో చక్రవర్తి పాల్గొన్నారు.

సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి


ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న ప్రజలు

ఆదోని, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం- పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తిపరిచేలా చూడాలని ఆదోని ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టంలో ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, ఆర్‌అండ్‌బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మనాభరెడ్డి, గృహ నిర్మాణశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మజ, ఆర్టీసీ డిపో డీఎం రఫీ పాల్గొన్నారు.

మైనార్టీ సంక్షేమం కోసం రూ. 90 కోట్లు



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ముస్లిం నాయకులు

నందవరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం రూ 90 కోట్ల నిధులు సీఎం చంద్రబాబు ఇచ్చారని టీడీపీ మండల కన్వీనర్ కాశీంవలీ అన్నారు. సోమవారం నాగలదిన్నె గ్రామంలో టీడీపీ కార్యాలయంలో మాజీ ఎంపీపీ తనయుడు మునాఫ్ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం కాశీంవలీ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయం ప్రకారం ఇమామ్‌లకు రూ. 10 వేలు, మౌజాన్లకు రూ. 5వేలు ప్రకారం వేతనం అందజేయనున్నారన్నారు. ఇందుకు చంద్రబాబుకు ముస్లీంలు ప్రత్యేక ధన్యవాదనలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షబ్బీర్, సలీం, మున్నా, చాంద్ పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న భక్తులు

కౌతాళం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న శాశ్వత అన్నదాన పథకానికి సోమవారం ఓ భక్తుడు రూ.లక్ష నగదును విరాళాలను అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్,ఈఓ వాణి తెలిపారు. సోమవారం ఆయన మాట్లా డుతూ కర్ణాటక రాష్ట్రం బళ్ళారి జిల్లా సిరుగుప్ప తాలుకా బంద్రాహాళు గ్రామ వాస్తవ్యులు హెడ్మాస్టర్ కాంతరెడ్డి కుటుంబ సభ్యులు రూ.1,00,000ల నగదును ఆలయ కార్యాలయంలో అందజేసినట్లు తెలిపారు. దాతలకు ఆలయ సూపరిటెండెంట్ మల్లికార్జున స్వామి అర్చకులు స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి లడ్డు ప్రసాదాలను అందజేశారు.

మాజీ వీఆర్వోపై కేసులు నమోదు చేయాలి



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

పెద్దకడబూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మాజీ వీఆర్వో మహబూబ్‌పటేల్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఐ నాయకులు తిక్కన్న, మబ్బు ఆంజనేయులు, రాజులు డిమాండ్ చేశారు. సోమవారం పెద్దకడబూరులని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఎస్‌డీటి శ్రీలతకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కల్లుకుంట గ్రామ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 514 భూమిలో దళితులకు, సామాజిక వర్గాలకు, భూమిలేని పేదవారికి ప్రభుత్వం పట్టాలు ఇచ్చారన్నారు. కాని గ్రామ మాజీ వీఆర్వో మహబూబ్‌పటేల్ ప్రభుత్వాన్ని, నిరుపేదలను మోసం చేసి ఆ భూమిని పెత్తందారులకు కట్టబెట్టారన్నారు. ఇలా గ్రామంలో వందల ఎకరాల భూమిని కాజేసి అమ్ముకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రైతులు మాదిగ చిన్నన్న, మాదిగ మల్లమ్మ, చాకలి బతకన్న, బోయ ఉసేని, వడ్డె గంగన్న లు పాల్గొన్నారు.

మంత్రాలయంలో ఆగని ఇసుక దందా

● మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

మంత్రాలయం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుక దందా యధేచ్ఛగా సాగుతుంది. రాత్రి పగలు అనే తేడా లేకుండా ట్రాక్టర్లతో నదిలో దిగి ఇసుకను తోడేస్తున్నారు. సోమవారం తహసీల్దారు రమాదేవి ఆదేశాల మేరకు ఆర్ఐ జనార్థన్‌రావు, వీఆర్‌వో భీమన్నగౌడ్ తుంగభద్ర నదిలో ఇసుకను లోడ్ చేస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.10 వేలు ప్రకారం రూ.30వేలు జరిమానా విధించారు. తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కేసులు నమోదుచేసి కఠినంగా శిక్షిస్తామని తహసీల్దారు రమాదేవి, సీఐ రామాంజులు హెచ్చరించారు.

గ్రామ కంఠకంలో కర్రలు తొలగింపు



గుడికల్ గ్రామంలో గ్రామకంఠకంలో కర్రలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఎమ్మిగనూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడికల్ గ్రామంలో ఉన్న గ్రామ కంఠకంలో అనుమతి లేకుండా గుడిసెలు నిర్మించుకునేందుకు ఏర్పాటు చేసిన కర్రలను సోమవారం రెవెన్యూ సిబ్బంది తొలగించారు. తహసీల్దార్ శేషఫణి మాట్లాడుతూ గ్రామకంఠకం స్థలంలో కొంతమంది ప్రభుత్వ అనుమతి లేకుండా గుడిసెలు వేసుకోవాలని కర్రలు పాతారని తెలిసిందని వెంటనే సిబ్బందిని పంపి వాటిని తొలగించామన్నారు. గ్రామ కంఠకం స్థలం కబ్జాకు గురికాలేదని, ఎవరు ఆక్రమించుకోలేదన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరైన ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఓలు, వీఆర్ఏలు ఉన్నారు.

కార్యకర్తలను ఆదుకుంటాం : వైసీపీ

మంత్రాలయం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కర్నాటకలోని గుంజహల్లి దగ్గర రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైసీపీ మహిళా నాయకురాలు రంగమ్మ రాయచూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి సోమవారం పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులు, కార్యకర్తలకు ఎటువంటి ఆపద, కష్టం వచ్చినా రాంపురం రెడ్డి సోదరుల కుటుంబం అండగా ఉండి అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వైసీపీ నాయకులు బాబు రెడ్డి, దశరథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

13మంది పీహెచ్ వర్కర్ల కారుణ్య నియమకానికి ఆమోదం

ఎమ్మిగనూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పురపాలక సంఘం పరిధిలో పనిచేస్తు మరణించిన 13మంది ఔట్‌సోర్సింగ్ పీహెచ్ వర్కర్ల కుటుంబాల్లోని వ్యక్తులకు కారుణ్య నియమకాలకు కలెక్టర్ ఆమోదం తెలిపిందని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సోమవారం తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి 13మంది కుటుంబ సభ్యులకు కారుణ్యనియమాకల్లో భాగంగా విధుల్లోకి తీసుకోవాలని కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపారన్నారు.ఇందుకు కలెక్టర్ మోదం తెలిపిందన్నారు. దాదాపు నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న అంశాన్ని ఎమ్మెల్యే కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఆప్‌కాస్ ఆన్‌లైన్‌లో డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా తప్పుగా నమోదు అయిన ఉద్యోగిని డీపీఓగా మార్పు చేసినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

తెగుళ్ల బెడద



పంటలకు తెగుళ్ల బెడద అధికమైంది. ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది వర్షాలు అధికంగా కురవడంతో పంటల ఎదగుదల కూడా తగ్గింది. దీనికి తోడు తెగుళ్లు సోకడంతో రైతులకు కంటిమీద కునుకులేకుండాపోయింది. ఎన్ని మందులు పిచికారి చేసినా ఫలితం లేదని రైతులు వాపోతున్నారు. ఇటీవల అధికారులు పొలంబడి కార్యక్రమాలు నిర్వహించారు. రైతలుఉసాగు చేసిన పంటలకు వైరస్ సోకినట్లు గుర్తించి పలు సూచనలు ఇచ్చారు.

● వరి, మొక్కజొన్న, వేరుశనగ, కంది పంటలకు సోకిన వైరస్
● తగ్గిన దిగుబడి ● ఆందోళనలో రైతులు

గోనెగండ్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఈ రబీ సీజన్‌లో ఎమ్మిగనూరు డివిజన్ ప్రాంతంలో ఎక్కువ రైతులు మొక్కజొన్న, వేరుశనగ, వరి పంటలను సాగు చేశారు. దాదాపు 10వేల ఎకరాలో సాగు చేశారు. అయితే ఇటీవల వ్యవసాయశాఖ అధికారులు పొలంబడి పేరుతో పలు గ్రామాల్లోని పంట పొలాలలో పర్యటించారు. సాగు చేసిన పంటలకు తెగుళ్ల ఎక్కువ సోకినట్లు వ్యవసాయశాఖ ఏడీఏ మహమ్మద్‌ఖాద్రీ, ఏవోహేమలత తెలుపుతున్నారు. గాజులదిన్నె ప్రాజెక్టు కింద అధికంగా వరి సాగు చేశారు. రైతులు ప్రస్తుతం వస్తున్న తెగుళ్లకు నివారణ చర్యలు తీసుకోకపోతే పంట నష్టం వస్తుందని అధికారులు తెలుపుతున్నారు.



మొక్కజొన్నకు సోకిన కత్తెర పురుగు

మొక్క జొన్న: మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు సోకింది. లార్వా పిల్ల పురుగులు గుడ్లనుంచి పొదిగి యొక్క ఎదుగుదల లేకుండా చేస్తుంది. ఆకులు రంధ్రాలు పడిపోతాయి. ఇందుకుగాను ఏమామెక్టిన్‌బెంజోయేట్ మందును ఒక లీటరు నీటికి 0.3 గ్రాములు కలుపుకొని మొక్క సుడుల్లో 3 నుంచి 4 చుక్కలు మందు ద్రావణం పడేటట్లు చూడాలి. అలాగే టర్షికం ఆకు ఎండు తెగులు కూడా సోకుంది. దీని నివారణకు ప్రోపికోనజోల్ 1మిల్లీ లీటర్ లేదా మాంజోజబ్, కార్బన్డెజమ్ 2 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

వేరుశనగ



వేరుశనగ పంటలో ఇనుము ధాతువులు లోపం ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ కారణంగా ఆకులు పసుపు పచ్చగా మారి తర్వాత తెల్లటి రంగులోకి మారుతుంది. నివారణకు అన్నబేది 5గ్రాములు ఒక లీటరు నీటిలో కలుపుకొని 10 రోజుల వ్యవదిలో రెండు సార్లు పిచికారి చేయాలి.



వరి

ఈ రబీలో సాగు చేసిన వరికి పంటకు మానిపండు తెగులు సోకింది. ప్రస్తుతం గింజ గట్టిపడే దశలో ఉంది. ఈ తెగులు ఆశించడం వల్ల గింజ పై పసుపురంగు ముద్దలు ఏర్పడి తర్వాత నలుపు రంగులోకి మారుతాయి. నివారణకు ప్రొపికోనజోల్ ఒక మిల్లీ లీటరును ఒక లీటరు నీటిలో కలుపుకొని పిచికారి చేస్తు తెగులు అదుపులోకి వస్తుంది.



గ్రామాభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే



సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధే తన ధ్యేయమని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మిగనూరు పార్లపల్లె గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి వీధిలో సీసీ రోడ్లు, తాగునీటి కొళాయిలను వేయించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గ్రామంలో ఎక్కడా కూడా తాగునీరు, సీసీ రోడ్ల సమస్యలు ఉండరాదని అధికారులకు తెలియజేశారు. గ్రామంలోని పాఠశాలను సందర్శించి ఏమైనా సమస్యలు ఉన్నాయా..లేదా అనే విషయాలను అక్కడి ఉపాధ్యాయులు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో రూ.40లక్షలతో ఏర్పాటు చేసిన నూతన సచివాలయం, రూ.21.80లక్షలతో నిర్మించిన ఆర్‌బీకే, రూ.7లక్షలతో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కార్యాలయం, రూ.10లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 17 నెలల్లోనే అభివృద్ధి అంటే ఏమో చేసి చూపించడం జరుగుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధికి వచ్చిన పంచాయతీ నిధులను కూడా దారిమళ్లించడం జరిగిందన్నారు. పార్లపల్లి గ్రామంలో వైసీపీ హయాంలో కనీసం తాగేందుకు కూడా గుక్కెడు నీరు దొరకని పరిస్థితి ఉండేదన్నారు. తాము అధికారంలోకి వచ్చిన 17నెలల్లోనే గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కె.టి వెంకటేశ్వర్లు, టీడీపీ మాజీ మండల కన్వీనర్ మల్లికార్జున, గ్రామ టీడీపీ నాయకులు పార్లపల్లె చంద్రశేఖర్‌రెడ్డి, నరేష్, భీమరాయుడు, బోడబండ సురేష్‌చౌదరి, విద్యాకమిటీ చైర్మన్ నాగరాజు, తాజుద్దీన్, రాజేష్, చెన్నాపురం నాగరాజు, సోగనూరు జగదీష్, రాఘవేంద్ర, దేవిబెట్ట సోమేశ్వరరెడ్డి, ఎంపీడీవో బంగారమ్మ, ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, పీఆర్ డీఈ చంద్రశేఖర్, ఏడీఈ మహమ్మద్‌ఖాద్రీ, ఏవో శివశంకర్, ఏఈవో నరసింహులు, పీఆర్ ఏఈ జయన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రేమ్‌కుమార్ లతో పటు ఆయా శాఖల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

● మండలంలోని ప్రజల తాగునీటి దాహార్తిని తీర్చడమే ధ్యేయమని టీడీపీ మండల కన్వీనర్ కె.టి వెంకటేశ్వర్లు అన్నారు. గార్లదిన్నె గ్రామంలో గత కొన్నేళ్లుగా గ్రామ ప్రజలు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడేవారు. గ్రామంలో ప్రజల తాగునీటి సమస్యను తెలుసుకున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు బోరు వేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. స్పందించిన అధికారులు గ్రామంలో తాగునీటి బోరును వేయించారు. తాగునీరు పుష్కలంగా రావడంతో సమస్య తీరింది. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రేమ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు కల్పించాలి



మాట్లాడుతున్న సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీలో విధులు నిర్వర్తిస్తూ మరణించిన పారిశుధ్య కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమాక్రసి జిల్లా ఉపాధ్యక్షుడు రాజులు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుల ఎల్లప్ప, శివ కృష్ణ, ప్రతాప్‌ల అధ్యక్షతన దీక్ష చేపట్టారు. అనంతరం వారు ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి తిమ్మగురుడు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో ఏళ్ల తరబడి పారిశుధ్య పని చేస్తూ 13 మంది కార్మికులు విధుల్లో మరణించారని, వారి కుటుంబ సభ్యులకు మున్సిపాలిటిలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇవ్వాల్సి ఉండగా అందుకు భిన్నంగా కమీషనర్ కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించకుండా ఐదేళ్లుగా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఇతర మున్సిపాలటిలో మృతి చెందిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పటికైనా కలెక్టర్, ఎమ్మెల్యే కమిషనర్, తక్షణమే స్పందించి వీరికి ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సల్మాన్, భీమన్న, వీరేష్, ఆశాజ్యోతి, సుమాంజలి, మారెమ్మ తదితరులు పాల్గొన్నారు.

కల్తీ విత్తనాలు నాటిన గుర్తు తెలియని వ్యక్తులు

గోనెగండ్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తమ పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు నకిలీ విత్తనాలు నాటారని ఐరన్‌బండ గ్రామానికి చెందిన గొల్ల గోవిందు, బోయ పాండు అనే రైతులు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన ఓ రైతు దగ్గర 10 ఎకరాలు కౌలుకు తీసుకొన్నారు. అదే భూమిని గ్రామానికి చెందిన మరో ఇద్దరు వ్యక్తులు ఆదే పొలం మాకు కౌలుకు ఇమ్మని యజమానిని అడిగారు. అయితే ఆ భూమి యజమాని వారికి ఇవ్వకుండా గొల్ల గోవిందు, బోయ పాండులకు కౌలుకు ఇచ్చాడు. కౌలుకు తీసుకున్న ఇద్దరు రైతులు గత ఐదు రోజుల క్రితం ముడు ఎకరాలలో హైబ్రిడ్ సీడ్స్ మొక్కజొన్న పంటను సాగు చేశారు. మిగిలిన ఏడు ఎకరాలో రెండు రోజుల క్రితం ఆదే రకం మొక్కజొన్న సాగు చేశారు. విత్తనాలు సాగు చేసిన రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పంటను నాశనం చేయాలనే ఉద్దేశంతో నాటిన చోట మరో రకం కల్తీ విత్తనాలను నాటారు. మరుసటి రోజు గోవిందు, పాండు ఇద్దరు పొలానికి వెళ్లి చూడగా పొలంలో తేడా కనిపించడంతో విత్తనాలను తవ్వి చూడగా అవి తాము వేసిన విత్తనాలు కావని, ఆ విత్తనాలను పరిశీలించగా కల్తీ విత్తనాలు అని గుర్తించారు. తమను దెబ్బతీయాలని ఈ విధంగా కుట్ర పన్నారని వాపోయారు. పది ఎకరాలకు సుమారు 3లక్షల విత్తనాలు కొనుగోలు చేశామని, మొత్తం నష్టపోయినట్లు పోలీసులకు వివరించారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మేకడోనలో చిరుతపులి సంచారం

పెద్దకడబూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేకడోన గ్రామంలో చిరుతపులి సంచారం చేసింది. గ్రామ పొలాల్లో ఉన్న చిరుతను ఓ రైతు వీడియోతీసి గ్రామంలోని వారికి చూపడంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గృహ నిర్మాణ కార్యాలయం పరిశీలన

ఎమ్మిగనూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఉన్న గృహనిర్మాణ సంస్థ కార్యాలయాన్ని ఆ సంస్థ స్టేట్ డైరెక్టర్ రామకృష్ణ, బేస్త కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రామాంజనేయులు పరిశీలించారు. స్థానిక అధికారులతో మాట్లాడి గృహనిర్మాణాల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరుపేదలందరికి గృహాలు అందించటమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో డీఈ ప్రసాద్, ఏఈ కుమార్, వర్క్ ఇన్స్‌పెక్టర్ మధు, సిబ్బంది నాగరాజులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందాలి



మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజక వర్గంలో ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందాలని మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్ రాఘవేంద్రరెడ్డి అన్నారు. సోమవారం మాధవరం తన నివాసంలో ఏపీ హౌసింగ్ రాష్ట్ర డైరెక్టర్ రామకృష్ణ, ఏపీ బెస్త సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బెస్త రామాంజనేయులు రాఘవేంద్ర రెడ్డిని కలిశారు. హౌసింగ్, బెస్త కార్పోరేషన్ ద్వారా మంత్రాలయం నియోజకవర్గంలోని 4 మండలాలకు సంక్షేమ పథకాలు అందిచాలన్నారు. డైరెక్టర్లను పూల మాలతో సన్మానించారు. కార్యక్రమంలో రఘు, నాగన్న, భీమ, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదవండి: ఎంఈవో

గోనెగండ్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఎంఈవో రామాంజినేయులు, నీలకంఠ అన్నారు. సోమవారం గోనెగండ్లలోని మెయిన్ స్కూల్ విద్యార్థులకు పీ. ఫారుక్ బాషా భోజనప్లేట్లను ఇవ్వడంతో ఆ ప్లేట్లను ఎంఈవో రామాంజినేయులు విద్యార్థులకు పంపిణీ చేశారు. 1995-99 వరకు ఇదే పాఠశాలలో చదివిన ఫారుక్ విదేశాలలో ఉద్యోగం చేస్తున్నాడని ఆయన తాను చదివిన పాఠశాలలో విద్యార్థులకు భోజన ప్లేట్లను పంపారన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని పాఠశాలకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నూరహమ్మద్, హెచ్ఎం బతకన్న, ఊట్ల రంగన్న, అనిఫ్, రంగస్వామినాయుడు, కిరణ్‌కుమార్, మునిస్వామి, కౌలుట్లయ్య, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

'దేశంలో బీజేపీకి ఎదురు లేదు..'



బీజేపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న నాయకులు

కోసిగి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దేశంలో కొన్ని రాష్ట్రాలు మినహా అన్ని రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ విజయదుందుభి మోగిస్తూ ఎదురులేని జాతీయ పార్టీగా నిలిచిందని కోసిగి బీజేపీ మండల అధ్యక్షుడు జర్లగేరి ఈరన్న అన్నారు. సోమవారం కోసిగిలోని డి.బెళగల్ రోడ్డులో ఉన్న బీజేపీ కార్యాలయంలో మొన్న విడుదలైన బీహార్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తమ్మారెడ్డి, కురువ మారెన్న, ఆర్లబండ హుశేనీ, జర్లగేరి ఈరేష్, నాడిగేని రాజు, నాగరాజు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కోసిగి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లు విధుల పట్ల అలసత్వం వహిస్తూ సమయ పాలన పాటించకపోతే చర్యలు తప్పవని ఐసీడీఎస్ మంత్రాలయం ప్రాజెక్టు సీడీపీవో రాజేశ్వరి అన్నారు. సోమవారం కోసిగిలోని 13వ అంగన్‌వాడీ సెంటర్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మిబాయి, కాత్యాయని ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించారు. సీడీపీవో రాజేశ్వరి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధులు నిర్వహించాలని, అలాగే మెనూ ప్రకారం ప్రీ స్కూల్ పిల్లలకు వంటలు చేసి కేంద్రంలో భోజనం చేయించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

రమణీయం.. ప్రహ్లాదరాయల వెండి రథోత్సవం



మంత్రాలయం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయలు వెండి రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. సోమవారం కార్తీక ద్వాదశి శుభ దినాన్ని పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెండి రథాన్ని వివిధ పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చారణాలు, మంగళ వాయిద్యాల మధ్య ప్రహ్లాదరాయలను ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు.

తప్పుడు ఆరోపణలు చేస్తే సహించం : టీడీపీ

ఎమ్మిగనూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని గుడికల్ టీడీపీ నాయకులు దేవదాసు, బోయ ఎలకన్న, బోయ అయ్యన్న, ఆంజనేయులు, కౌలుట్ల అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ గుడికల్ గ్రామంలో సర్వేనంబర్ 294లో 1.14ఎకరాల ప్రభుత్వ భూమిలో వైసీపీ నాయకుల అండతో ఆప్రాంతంలో నివాసం ఉంటున్న కొంతమంది వైసీపీ కార్యకర్తలు కబ్జా చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయంపై టీడీపీ నాయకులు అధికారులకు ఫిర్యాదు చేశామని, దీంతో అధికారుల వాటిని తొలగించారన్నారు. గతంలో వైసీపీనాయకులు శ్రీరాం నగర్‌లో పది ఎకరాల భూమిలో అక్రమంగా బండలు పాతిస్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. అయితే ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డికి ప్రజలకు మేలు చేయటమే తెలుసన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామ కంఠకం భూమిలో వాల్మీకి భవనం నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చామన్నారు. టీడీపీ నాయకులు కబ్జాలు చేసినట్లు నిరూపించాలని సవాల్ విసిరారు.

వైభవంగా కార్తీక పూజలు



గోనెగండ్లలో లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న వీరశైవమఠం పీఠాధిపతి శివయ్య స్వామి



మార్కెండేయ స్వామి దేవాలయంలో ఆకాశ దీపాన్ని వెలగిస్తున్న అర్చకుడు



కార్తీకదీపాలు వెలిగిస్తున్న మహిళలు

కోసిగి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని మార్కెండేయ స్వామి దేవాలయంలో కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా ఆలయంలో మహిళలు, పిల్లలు ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తీకదీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

గోనెగండ్ల: గోనెగండ్లలోని కింది వీధి నీలకంఠేశ్వరదేవాలయంలో వీరశైవమఠం పీఠాధిపతి శివయ్యస్వామి లక్ష బిల్వాలతో అర్చన నిర్వహించారు. అనంతరం మహా రుద్రాభిషేకం చేశారు.

మంత్రాలయం: మంత్రాలయంలోని రామలింగేశ్వరునికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. జంగం వీరభద్రస్వామి, సిద్దయ్యస్వామి, జంగం సిద్దలింగయ్య,చిన్న శంకరయ్య స్వామి, శ్రీశైలం పాలకమండలి మాజీ సభ్యులు సుజాత, ఆడిట్ శంకర్ పూజలు నిర్వహించారు.



మంత్రాలయంలో రామలింగేశ్వరుని విశేషంగా అలంకరించిన దృశ్యం